# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

8.2.2026 ఆదివారం sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 208 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana







## ఏయ్ ఒవైసీ.. కరీంనగర్ నా అడ్డా

కరీంనగర్‌పై ఎగిరేది కాషాయ జెండానే!

కేంద్ర మంత్రి బండి మాస్ వార్నింగ్



3

## అగ్ని ప్రమాదంపై కేటీఆర్ అనుమానం



ఓటుకు నోటు ఆధారాలు తగులబెట్టారన్న కేటీఆర్

2

## హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

- దట్టంగా అలముకున్న పొగతో ఉక్కిరిబిక్కిరి
- మంటలను ఆర్పిన ఐదు ఫైర్ ఇంజన్లు

2






2

## గోదావరి జలాలపై పేచీ లేదు

ఎన్నికల ప్రచారంలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్

## బీజేపీ, బీఆర్ఎస్ మధ్య నక్కజిత్తుల రాజకీయం



3

- బండి సంజయ్ తన భార్య కంటే నన్నే ఎక్కువ ఇష్టపడతాడు..
- కరీంనగర్ రాజకీయ గేమ్ మార్చే శక్తి ఎంఐఎంకే ఉంది..
- ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ

## సిద్దిపేటలో సంచరిస్తున్న పెద్దపులి

2




## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

2

బస్తర్ జిల్లాలో లొంగిపోయిన 51మంది మావోలు





## అగ్ని-3 పరీక్ష సక్సెస్

భారత అమ్ములపొదిలో మరో అస్త్రం

చాందీపూర్ వేదికగా సత్తా చాటిన స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్

3 వేల కి.మీ. పరిధి లక్ష్యాల ధ్వంసం

బ్రహ్మోస్ నుంచి అగ్ని-5 వరకు విస్తృత శ్రేణి క్షిపణులు సిద్ధం

3


## మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్

- కౌలాలంపూర్‌లో ప్రధాని మోదీ ప్రకటన
- ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు

4



మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమిత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు.



## అమెరికాతో ఒప్పందం మనకే నష్టం

మన రైతులకు తీరని అన్యాయం

ఎక్స్ వేదికగా కాంగ్రెస్ జైరాం రమేశ్ విమర్శలు

4




## మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే

### మరో మూడేళ్లు అధికారంలో ఉండేది మేమే

**అభివృద్ధి చేస్తున్నాం.. ఇంకా చేసి చూపిస్తాం**

- వికారాబాద్, పరిగి, తాండూర్‌కు గోదావరి నీళ్లు పారిస్తాం
- కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరంగా మారింది
- బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొట్టండి
- వికారాబాద్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7:** వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతిబాట బహిరంగ సభ పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో మంజూరైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలను అందిస్తే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవేనని, కానీ కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల జిల్లా రైతాంగం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని, ఆ ప్రాజెక్టు నిధులతో ఆయన కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకుని వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి

మిగతా 2 లో



# గోదావరి జలాలపై పేచీ లేదు

## ఎన్నికల ప్రచారంలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్

**మంచిర్యాల,ఫిబ్రవరి7 :** గోదావరి జలాల విషయంలో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఎలాంటి గొడవలు లేవని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాగజ్‌నగర్‌లో జరిగిన సభలో పాల్గొన్న ఫడ్నవీస్.. గోదావరి జలాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా.. మేం నీళ్లు ఇవ్వడం వల్లే తెలంగాణ సస్యశ్యామలంగా ఉంది. మాకు నష్టం జరిగినా నీళ్లు ఇస్తున్నామన్నారు. అందరూ బాగుండాలనే సంకల్పంతో బీజేపీ ముందుకు సాగుతోంది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ప్రధానిమోదీ పాలనలో పట్టణాల అభివృద్ధికి కేంద్రం నేరుగా నిధులు మంజూరు చేస్తోందన్నారు ఫడ్నవీస్. స్మార్ట్, అమృత్ పథకాలతో పట్టణాలను అభివృద్ధి చేస్తోందన్నారు.పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి ప్రధాని అధికంగా నిధులు ఇస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు మహారాష్ట్ర సీఎం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ధనిక రాష్ట్రంగా ఉంది.. ఇప్పుడు అప్పుల పాలయ్యింది.. బీఆర్ ఎస్, కాంగ్రెస్ లు తెలంగాణను అప్పుల పాలు చేశాయన్నారు. పైసా లేకుండా రాష్ట్రాన్నిఎలా అభివృద్ధి చేస్తారంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేసి అవినీతిపాలనతో అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నో కలలతో ఏర్పాటైన తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

## బస్తర్ జిల్లాలో లొంగిపోయిన 51మంది మావోలు




**రాయపూర్,ఫిబ్రవరి 7 :** మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ జిల్లా బస్తర్ డివిజన్‌లో 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై రూ.1.61 కోట్ల రివార్డు ఉంది. వీరంతా బస్తర్ ఎస్పీ జితేందర్ యాదవ్ సమక్షంలో శనివారంనాడు లొంగిపోయారు. బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయమైన జగదల్‌పూర్‌లో బస్తర్ పాండుమ్ 2026 ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అమిత్‌షా రాయపూర్ వచ్చిన రోజునే ఇంత పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ÷ూగా, బిజాపూర్ జిల్లాలో 20 మంది మహిళా క్యాడర్‌తో సహా 30 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మరో 21 మంది సుక్మా జిల్లాలో లొంగిపోయారని ఎస్పీ సుందరరాజ్ తెలిపారు. వీరిలో 14 మంది మహిళా క్యాడర్ ఉన్నారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి కా÷-డ్గ÷క్స్ వైర్‌లు, జెలటిన్ స్టిక్‌లో స్వాధీనం చేసుకున్నామన్నారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు 50 వేల తక్షణ ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పునరావాస చర్యలతో స్వచ్ఛందంగా వీరంతా లొంగిపోయినట్టు చెప్పారు. కాగా, తక్కిన మావోయిస్టు క్యాడర్ కూడా హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి భద్రత, గౌరవంగా జీవించేందుకు అవసరమైన పునరావసం కల్పిస్తామని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ కోరారు.

# సిద్దిపేటలో సంచరిస్తున్న పెద్దపులి



**సిద్దిపేట, ఫిబ్రవరి 7:** సిద్దిపేట జిల్లాలోని ధూళిమిట్ట మండలం కూటిగల్, భైరన్‌పల్లి శివారులో పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మద్దూర్ మండలం లధ్నూర్, అమ్మాపూర్ గ్రామాల్లో పులి.. లేగ దూడలపై దాడిచేసి చంపడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు.. పులి పాదముద్రలను పరిశీలించారు. పులి పాదముద్రల ఆధారంగా యాదాద్రి జిల్లా నుంచి సిద్దిపేటలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. దూల్మిట్ట, మద్దూర్ మండలాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం వేళ బయటకు రావొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం పాదముద్రల ఆధారంగా పులి జాడ కోసం అధికారులు అన్వేషిస్తున్నారు.

# ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మృతి..మరికొందరికి గాయాలు

**సంగారెడ్డి,ఫిబ్రవరి7 :** ఔటర్ రింగ్రోడ్డుపై జరిగిన ఘోర ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధి పోచారం ఔటర్ రింగ్ రోడ్డుపై ఈ రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మౌనిక(36), నవీన్ (30) అక్కడికక్కడే మృతిచెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో హరిప్రసాద్, హర్ష, అమృత, సుశ్రుతకు తీవ్రంగా గాయాలయ్యాయి. వీరంతా బౌరంపేట సింహపురి కాలనీవాసులుగా గుర్తించారు. వాహనదారులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు పోలీసులు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను పటాన్ చెరులోని ఓ హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే

మొదటి పేజీ తరువాయి

కోసం ముందుకు వెళుతోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, బీజేపీ , బీఆర్ఎస్ పార్టీల మధ్య 'చీకటి ఒప్పందాలు' ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ-ఫామ్‌లను బీఆర్ఎస్ ఆఫీసుల నుండి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ, గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా ఢిల్లీలో ఉండే పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఏమిటని ప్రజలను ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మక్తల్, నారాయణపేట , కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ రోడ్డు పూర్తి కాకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టానికి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిలే బాధ్యులని విమర్శించిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం కోర్టు కేసులను పరిష్కరించి ఆ రోడ్డు పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు రాబోతున్నాయని, వికారాబాద్ త్వరలోనే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ చరిత్రను తాను చెరిపేయాలని చూస్తున్నానని కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర, దొంగ నోట్ల వ్యవహారం, దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర తెలంగాణ ఉన్నంత కాలం చెరిగిపోదని, ఆ 'పాపాల భైరవుడి' చరిత్ర ప్రజలకు గుర్తుండేలా చేసే బాధ్యత తనదని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేశామని గుర్తు చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విషం చిమ్మే పాములకు మళ్ళీ పాలు పోయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను




గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నాం. అప్పులున్నా.. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో నిలబడి కొట్లాడాలి కానీ, చీకటి ఒప్పందాలు చేసుకొని ఫెవికాల్ బంధంతో భాజపా, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు చేస్తున్నాయి. బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారు. కాంగ్రెస్‌తో పోరాడటం మావల్ల కాదని భాజపాతో బీఆర్ఎస్ కలిసిపోయింది. భాజపా అభ్యర్థుల బీఫామ్‌లు బీఆర్ఎస్ పార్టీలో ఇచ్చే దుస్థితి ఏర్పడింది. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్, భాజపా ప్రయత్నించలేదు. ప్రధాని మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. పదేళ్లలో సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్, భాజపా నేతలు వంగి వంగి దండాలు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదు. అడగకుండానే ప్రజలు ఓటేసేవారు. ఓట్లు కావాలి కానీ, ప్రజల సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా? ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.38వేల కోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కేసీఆర్ సీఎం అయ్యాక రంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. తెలంగాణ ఉద్యమ నాయకుడినని చెప్పుకొని కేసీఆర్.. రంగారెడ్డి జిల్లాలకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే బాధ్యత మాది అని సీఎం హామీ ఇచ్చారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, కల్లకుంట్ల కిషన్ రావు గుర్తు పెట్టుకోండి తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐదేండ్ల కోసం ఎన్నికైనం.. మరో ఐదేళ్లు పదవిలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లు పవర్‌లో ఉన్న బీఆర్ఎస్.. 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఏనాడు మన సమస్యలని పట్టించుకోలేదని విమర్శించారు. మూసీ నది ప్రక్షాళన చేస్తామంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని.. అభివృద్ధి పనులకు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ పేరుతో పెళ్లాంమొగుళ్ల మాటలు కుడా విన్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అనైతిక పనులు, తప్పులు చేస్తే నోటీసులు ఇవ్వకపోతే ఏం చేస్తారని ప్రశ్నించారు. దళితలను సీఎం చేస్తానన్న మీ చరిత్రను నేనేలా తూడ్చుతానని.. కేసీఆర్ తెలంగాణ ద్రోహిగా మిగిలిపోతారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొఖం చెల్లకే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదని విమర్శించారు. గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలంతా ఆలోచించి ఓటేయాలని సూచించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు స్థానిక నేతలు సభలో పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

- దట్టంగా అలముకున్న పొగతో ఉక్కిరిబిక్కిరి
- మంటలను ఆర్పిన ఐదు ఫైర్ ఇంజన్లు




**హైదరాబాద్, ఫిబ్రవరి 7:** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, ఐదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేసారు. అయితే అత్యంత రద్దీగా ఉండే ఈ అప్రాంతంలో పక్కనే నీలోఫర్ ఆస్పత్రి కూడా ఉంది. ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాంచారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. ఉదయం 10 గంటల ప్రాంతంలో మొదటి ఫ్లోర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ఫ్లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ మంటల్లో ఫోన్ ట్యాపింగ్‌కు కేసుకు సంబంధించిన హార్డ్ డిస్కులూ కాలిపోయినట్లు సమాచారం.నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరిరజన్లతో మంటలనున అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటుకు నోటు కేసు సహా పలు కీలక కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఎవిడెన్స్‌లు ఇక్కడే ఉండటంతో ఈ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉండొచ్చని అంటున్నారు.

# మొదటి అంతస్తులో చెలరేగిన మంటలు

## కీలక పత్రాలు, కంప్యూటర్లు అగ్నికి ఆహుతి

## సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7:** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కీలక పత్రాలు మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. అయితే ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి.. హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదంపై సమాచారం అందిందని డీసీపీ శిల్పవల్లి వివరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పుకొచ్చారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్స్, ఎవిడెన్స్‌కు సంబంధించి ఈ ల్యాబ్ నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. మంటల్లో కీలక ఫైల్స్ కాలిపోయిన విషయంపై ఇంకా స్పష్టత లేదన్నారు. మొదటి అంతస్తులో కంప్యూటర్స్ ఉంటాయని ఆమె వెల్లడించారు. 5 ఫైర్ ఇంజిన్‌ల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశామని డీసీపీ తెలిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ మంటలను గమనించి సమాచారం అందించారని వివరించారు. ఆఫీస్ బాయ్ గమనించి వెంటనే మంటలార్పే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు లోనయ్యారని.. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించామని డీసీపీ తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నలుగురు ఉద్యోగులు లోపలే ఉన్నారన్నారు. మంటలు గమనించి వారు సురక్షితంగా బయటపడ్డారని ఆమె చెప్పారు. తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో మంటలు అదుపులోకి వచ్చాయని డీఎఫ్ఓ శ్రీ దాస్ తెలిపారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు. శనివారం ఉదయం 10:22 గంటలకు అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిందని ఆయన అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నామని.. అప్పటికే మంటలు ఎగసి పడుతున్నాయని తెలిపారు. కెమికల్ ల్యాబ్ మెటీరియల్ మొత్తం రెండో అంతస్తులో ఉందని చెప్పుకొచ్చారు. అయితే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించలేదన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ప్లాస్టిక్ వస్తువుల కాలిపోయాయని వివరించారు.హార్డ్ డిస్కులు పూర్తిగా కాలిపోయాయా.. పాక్షికంగా కాలాయా.. అన్నది పరిశీలించాలని డీఎఫ్ఓ తెలిపారు.

# అగ్ని ప్రమాదంపై కేటీఆర్ అనుమానం

## ఓటుకు నోటు ఆధారాలు తగులబెట్టారన్న కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7:** హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్‌లను, ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టించిన తప్పుడు ఆధారాలను కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తుందని సందేహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. కాగా, బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ కూడా ట్విట్టర్ వేదికగా స్పందించారు. మొత్తం ల్యాబ్ కాలిపోతుంది.. ఏ ఆధారాలు నాశనం చేశావు అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ల్యాబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌లో తొలుత మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ÷రిరజన్లతో మంటలనున అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ




శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత ఆస్తి నష్టంపై స్పష్టత వస్తుందని పోలీసులు తెలిపారు.

# పోచారం కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారు

- ప్రజలంతా ఆయనను నిలదీయాల్సిందే
- గతంలో తిట్టిన కాంగ్రెస్ పంచాన చేరిన పోచారం
- అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ విమర్శలు



**కామారెడ్డి, ఫిబ్రవరి 7 :** కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు వెళ్లారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించిన పోచారం, ఇప్పుడు అదే పార్టీ పంచన చేరడం వెనుక కారణాలేమిటో ప్రజలు నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేటీఆర్, కొయ్యగుట్టలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించిన కేటీఆర్, పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బాన్సువాడ ప్రజలు నమ్మి గెలిపించిన పోచారం ఏం చేశాడని ప్రశ్నించిన కేటీఆర్, సీఎం రేవంత్ రెడ్డి గతంలో పోచారంపై చేసిన ఆరోపణలను గుర్తు చేశారు. ఒకప్పుడు పోచారాన్ని తీవ్రంగా తిట్టిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఆయనను పక్కన పెట్టుకోవడాన్ని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గత వ్యాఖ్యలను ఫోన్‌లో పెట్టి ప్రజలకు వినిపించారు. పోచారం బాన్సువాడకు సిగ్గు తీసుకొచ్చారని ఆరోపించారు. బీఆరెస్ పాలనలోనే బాన్సువాడలో అభివృద్ధి జరిగిందని కేటీఆర్ తెలిపారు. తమ హయాంలోనే బాన్సువాడను మున్సిపాలిటీగా మార్చామని, పదేళ్ల పాలనలో నియోజకవర్గంలో రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. భవనాలు, ఆసుపత్రులు, కులసంఘాల భవనాలకు రూ.500 కోట్లు ఇచ్చామని, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్లు వంటి పథకాల ద్వారా వేలాది మందికి లబ్ధి చేకూరిందని వివరించారు. ఆ నిధులన్నీ కేసీఆర్ వల్లే వచ్చాయని, పోచారం తెచ్చిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తులం బంగారం, స్కూటీలు, ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా, మహిళలకు రూ.2500, రూ.4000 పెన్షన్లుఏవీ అమలుకాలేదని మండిపడ్డారు. ఫ్రీ బస్సు పేరుతో మహిళలను మోసం చేస్తున్నారని, కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ఎప్పటికీ కాంగ్రెస్ మనిషి కాదని, లోపల బీజేపీ నాయకుడేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆరెస్‌కే ఓటు వేయాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో నిజంగా లబ్ధి పొందినవాళ్లు మాత్రమే ఆ పార్టీకి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. రానున్న కాలంలో మళ్లీ బీఆరెస్ ప్రభుత్వమే ఏర్పడి పట్టణాలను గతంలోకన్నా గొప్పగా అభివృద్ధి చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

# ఆధిపత్య పోరు కావాలా.. అభివృద్ధి కావాలా?

- తూప్రాన్‌లో నేతల గొడవలతో అభివృద్ధి వెనక్కు
- మున్సిపల్ ప్రచారంలో హరీష్ రావు విమర్శలు



**గజ్వేల్, ఫిబ్రవరి 7 :** తూప్రాన్‌లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నర్సారెడ్డి, మైనంపల్లి మధ్య ఆధిపత్య పోరు కారణంగా ప్రజల ప్రయోజనాలు నష్టపోతున్నాయని మండిపడ్డారు. ప్రజలకు ఆధిపత్య రాజకీయాలు కావాలా, అభివృద్ధి కావాలా అనేది ఆలోచించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తూప్రాన్‌లో పర్యటించిన హరీశ్‌రావు అల్లాపూర్ చౌరస్తాలో జరిగిన సభలో పాల్గొన్నారు. అక్కడి నుంచి తూప్రాన్ బస్టాండ్ వరకు రోడ్‌షో నిర్వహించి, అనంతరం కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. కేసీఆర్ హయాంలో తూప్రాన్‌లో జరిగిన అభివృద్ధిని గుర్తుచేసుకుంటూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు ఒకప్పుడు తూప్రాన్‌లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉండేదని, కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు ఇచ్చి సమస్యను పరిష్కరించామని చెప్పారు. తూప్రాన్‌ను మున్సిపాలిటీగా మార్చడం, ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు, ఫోర్‌లైన్ రోడ్ల నిర్మాణం వంటి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినవేనని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి నిలిచిపోయిందని, రోడ్ల మరమ్మతులు కూడా సరిగా జరగడం లేదని విమర్శించారు. రైతుబంధు, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, గొర్రెల పంపిణీ వంటి పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. బీజేపీపై కూడా విమర్శలు చేస్తూ, తూప్రాన్‌కు ఆ పార్టీ ఏ అభివృద్ధి చేయలేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చిన హరీశ్‌రావు, తూప్రాన్ అభివృద్ధి బాధ్యత తనదేనని తెలిపారు.

# ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

- కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటే అడ్డుకున్నదెవరు
- రేవంత్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 7:** మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది సీఎం కాదా అని ప్రశ్నించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతగాక.. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తమకు అవసరం అని చెప్పుకోవాలి కానీ.. కిషన్ రెడ్డి మీదనో, కేంద్ర ప్రభుత్వం మీదనో నిందలు వేయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డిని అడ్డుపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్క రోజైనా రాహుల్‌గాంధీ.. రేవంత్ రెడ్డిని ఆదేశించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలకు రాహుల్ గాంధీ అడ్డుపడకుంటే తక్షణమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడ్డుకోవడం కోసం సోనియా కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఏకమయ్యాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉంటే వారు మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు. పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. తమ ఎంపీలకు మోదీ సమ ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో చెబుతామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు.



# స్కూల్ బస్సులో మంటలు

**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 7:** చిట్యాల మండలం చల్ల గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. అయితే, ప్రమాద సమయంలో బస్సులో 15 మంది విద్యార్థులు ఉన్నారు. డ్రైవర్, గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై పిల్లల్ని బస్సు నుంచి కిందకు దింపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనపై రవాణా శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. స్కూల్ బస్ ఫిట్ నెస్ తోపాటు మంటలు రావడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటనలో విద్యార్థులకు ఎటువంటి గాయాలు, ప్రాణ నష్టం జరగకపోవడంతో తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.



# ఏయ్ ఒవైసీ.. కరీంనగర్ నా అడ్డా

## కరీంనగర్‌పై ఎగిరేది కాషాయ జెండానే!

## కేంద్ర మంత్రి బండి సంజయ్ మాస్ వార్నింగ్

**కరీంనగర్, ఫిబ్రవరి 7 :** "ఏయ్ ఒవైసీ.. గుర్తుంచుకో, కరీంనగర్ నా అడ్డా! ఇక్కడ ఎగిరేది కాషాయ జెండానే. గతంలో నేను చెప్పినట్లుగానే కేసీఆర్‌ను ఫాంహౌస్‌కు పంపి గులాబీ జెండాను పాతరేశాను. ఇప్పుడు ఈ పచ్చ జెండాను పాతిపెట్టే వరకు విశ్రమించను" అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిప్పులు చెరిగారు. శనివారం కరీంనగర్‌లోని బ్యాంక్ కాలనీ, భగత్ నగర్ భగత్ సింగ్ విగ్రహ చౌరస్తా వద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొని ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శల దాడి చేశారు. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎంకు మేయర్ సీటును కట్టబెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే ఒవైసీ ఇక్కడికి వచ్చి మేయర్ పీఠం కైవసం చేసుకుంటామని బీరాలు పలుకుతున్నారని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న కరీంనగర్‌లో మతం పేరుతో చిచ్చు పెట్టి మారణహోమం సృష్టించేందుకు ఎంఐఎం కుట్ర చేస్తోందని, పొరపాటున ఆ పార్టీని గెలిపిస్తే శాంతిభద్రతలు క్షీణిస్తాయని ప్రజలను హెచ్చరించారు. ముస్లిం మహిళల కష్టాలను గుర్తించి మోదీ ప్రభుత్వం ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేసిందని, దీనిపై సమాధానం చెప్పాలని ఓవైసీకి సవాల్ విసిరారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన ప్రతి అభివృద్ధి పని కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగిందని బండి సంజయ్ స్పష్టం చేశారు. "నేను రూ. 1,500 కోట్ల నిధులు కేంద్రం నుండి తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తే, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన నిధులని అబద్ధాలు చెబుతున్నాడు. అసలు గంగుల ముఖం మోదీకి తెలుసా?" అని ఎద్దేవా చేశారు. స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన మెయిన్ రోడ్లు, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, అమృత్ పథకం కింద ఆధునీకరించిన పార్కులు మరియు రజకుల కోసం రూ. 2 కోట్లతో నిర్మించిన మోడ్రన్ దోబీ ఘాట్ వంటి పనులన్నీ తన కృషితోనే సాధ్యమయ్యాయని వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కేవలం 4 సీట్లకే పరిమితం కాబోతోందని బండి సంజయ్ జోస్యం చెప్పారు. 6 గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతుందని నిలదీశారు. మహిళలకు రూ. 2,500, తులం బంగారం వంటి హామీలు ఏవయ్యాయని ప్రశ్నించారు. బీజేపీకి మేయర్ పీఠం అప్పగిస్తే కేంద్రం నుండి నిధుల వరద పారిస్తానని, ప్రజలపై పన్నుల భారం లేకుండా అభివృద్ధి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థులు సునీల్ రావు, చొప్పరి జయశ్రీ, వీణంక రేణుక, నాంపల్లి శ్రీనివాస్ తదితరులను గెలిపించాలని ఆయన విన్నవించారు.

# బీజేపీ, బీఆర్ఎస్ మధ్య నక్కజిత్తుల రాజకీయం

## బండి సంజయ్‌తన భార్య కంటే నన్నే ఎక్కువ ఇష్టపడతాడు..

## ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ



**కరీంనగర్, ఫిబ్రవరి 7 :** కరీంనగర్ రాజకీయాల్లో గేమ్‌చేంజ్‌చేసే శక్తి కేవలం ఎంఐఎం పార్టీకే ఉందని ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ స్పష్టం చేశారు. కరీంనగర్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన భార్యలకంటే ఎక్కువగా తననే ఇష్టపడతారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన ఓవైసీ, బీజేపీ నేతలు నిత్యం తన పేరునే ప్రస్తావిస్తూ విమర్శలు చేయడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేయడం అంటే బీజేపీకి ఓటు వేసినట్లేనని, రెండు పార్టీలు లోపాయికారీగా రాజకీయాలు నడుపుతున్నాయని ఆరోపించారు. ఎంఐఎం దయాదాక్షిణ్యాలతోనే గంగుల కమలాకర్ ఎమ్మెల్యేగా గెలిచారని, నేడు అదే ఎంఐఎంపై విమర్శలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎంఐఎం మాజీ కార్పొరేటర్లను బీఆర్ఎస్‌లో చేర్చడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది కార్పొరేటర్లను గంగుల కమలాకర్ బీజేపీలో చేర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందే గంగుల కమలాకర్ బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని, ఈడీ, సీబీఐ, ఐటీ దాడుల నుంచి తప్పించుకునేందుకే కాషాయ శిబిరం వైపు చూస్తున్నారని ఆరోపించారు. కమలాకర్‌కు నిజంగా దమ్ముంటే కవిత, కేటీఆర్‌లను కలిపి ఉంచాలని కేసీఆర్‌కు చెప్పాలని హితవు పలికారు. దేశ రాజకీయాలపై మాట్లాడుతూ, వైట్‌హౌస్‌లో కూర్చుని డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లే ప్రధాని నరేంద్ర మోడీ నడుచుకుంటున్నారని విమర్శించారు. ట్రంప్ భారత్‌ను చమురు కొనుగోళ్లపై హెచ్చరిస్తుంటే మోడీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దేశానికి పెట్రోలియం మంత్రి ట్రంపా? హర్దీప్ సింగ్ పూరీనా? అన్నట్లుగా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలు ఓవైసీ సోదరులను తిట్టడం తప్ప మరొక పని చేయలేరని, మత కుల రాజకీయాలతోనే ఓట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. గాల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ప్రస్తావిస్తూ, భారత భూభాగంలో చైనా ఎలా ప్రవేశించిందని, ఆర్మీకి స్వేచ్ఛ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని కేంద్రాన్ని నిలదీశారు. యూజీసీ చట్టంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదివే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. రోహిత్ వేముల ఘటనను గుర్తు చేస్తూ అణగారిన వర్గాలను విద్య నుంచి దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. కరీంనగర్‌లోని 15 డివిజన్లలో ఎంఐఎం కార్పొరేటర్లను గెలిపిస్తే తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్‌లైట్లు, సర్టిఫికెట్ల డోర్‌డెలివరీ వంటి మౌలిక సదుపాయాలన్నింటినీ మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. పేద ముస్లింల ఇళ్ల కూల్చివేతను ఎంఐఎం అడ్డుకుందని, గంగుల అనుచరులపై కేసులు నమోదు చేయించిందన్నారు. రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై ఎంఐఎం జెండా ఎగురుతుందని జోస్యం చెప్పారు. తనదైన శైలిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై విరుచుకుపడిన ఓవైసీ ప్రసంగానికి యువత నుంచి ఉత్సాహభరితమైన స్పందన లభించింది.



సంపాదకీయం

# విపక్షంగా కాంగ్రెస్ వైఫల్యం

దేశంలో రాజకీయ నేతలు బానిస భాజాలంతో బతుకుతున్నారు. అధికారపక్షంపై బట్టకాల్చి మీద పడేస్తే.. తరవాత అధకారం మనదే అన్న ధోరణిలో ఉన్నారు. ఎవరి లక్ష్యమైనా అధికారమే. అధికారంలో ఉన్నవారు దానిని కాపాడుకునే ప్రయత్నం..లేనివారు అధికారంలోకి వచ్చే ప్రయత్నాల్లో విన్యాసాలు చేస్తున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఎవరి పేరుందో వెతికి మరీ విమర్శలకు దిగుతున్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇందులో ముందున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతన్న వేళ సమస్యలపై పోరాటం ఆపేశారు. ప్రజల పక్షాలన పోరాడలేక చతికిల పడ్డారు. పార్లమెంట్‌కు రావడం గోల చేయడం, వాకౌట్ చేయడం ఇదీ విపక్షాలు అలవాటు చేసున్న నమూనా. అధికార బిజెపి ఏదయితే కోరుకుంటుందో అదే చేస్తున్నారు. మనదేశంలో జరిగిన దారుణ ఘటనలకు సంబంధించి కాశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్‌పై చర్చ అసవరం లేదు. దేశంలో జరుగుతున్న సమస్యలపై చర్చ పట్టదు. ఉపాధిపతకానికి గాంధీ పేరు తొలగించారని ఆందోళన చేస్తారు. ఇది ప్రజలకు కూడాగుడ్డా పెట్టేది కాదు. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో రాహుల్ ఓ అసమర్ధ నేత అని ఉంది. అది నిజమే అన్నట్లుగా గత పదేళ్లుగా రాహుల్ ప్రజల సమస్యలపై ఒక్కటంటే ఒక్క పోరాటం చేయలేదు. పార్లమెంట్‌లో పోరాడడం లేదు. నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకోవడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీకి ఏమైంది అన్న ఆందోళన కలుగుతోంది. నాయకత్వ సమస్య ఈ పార్టీని పట్టిపీడిస్తున్నది. సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిన ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు వెలవెలబోవడానికి కారణం కేవలం రాహుల్ అన్నదే గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు పొందడానికి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ పాదయాత్ర చేసి ఇప్పుడేమో అచేతనంగా ఉండిపోయారు. పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. నవతరం ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దడంలో, విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం పూర్తిగా విఫలమవుతోంది. వం- ُస ఓటములతో పార్టీ భవిష్యత్తు మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పెద్దగా కార్యాచరణ చూపడం లేదు. మోడీ వైపల్యాలను ఎండగట్టడానికి పార్లమెంట్ మంచి వేదిక. పార్లమెంటులో వివిధ అంశాలను లేవనెత్తి వాటిపై చర్చించే అవకాశం ఉంటుంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం కావచ్చు, బడ్జెట్ ప్రసంగం కావచ్చు...వీటిపై చర్చలో ప్రభుత్వ విధానాలను ఏకిపారేయవచ్చు. కానీ దానిని ఉపయోగించు కోవడంలో విపక్షనేతగా రాహుల్ పూర్తిగా విఫలం అయ్యారనే చెప్పాలి. సంబంధం లేని మాజీ ఆర్మీ చీఫ్ నరవాణెళి రాతలను ప్రస్తావిచడం ద్వారా అభాసుపాలయ్యారు. ఎందుకంటే ఆ పుస్తకం ఇంకా అచ్చు కాలేదు. ఇలా వరుస వైఫల్యాలను చూసిన తరవాత కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ ఎందుకు వెనుకబడుతున్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్నది పట్టించుకోవడం లేదు. వారి ఆలోచన ల్లో వచ్చిన మార్పు ఏమిటి అన్నది పసిగట్టలేకపోవడమే కారణంగా కనిపిస్తోంది. ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు అంతర్ధానం అయ్యాయి. వారు ఇప్పటికీ అది గమనించడం లేదు. అమెరికాతో ఒప్పందాన్ని కూడా వ్యతిరేకించడమంటే అంతకు మించిన దౌర్భాగ్యం మరోటి లేదు. ప్రపంచంలో మనదేశం మనుగడ సాగించాలంటే ఒప్పందాలు తప్పవు. ట్రంప్ బెదరింపుల కారణంగా ఇంతకాలం మోడీ నిశ్శబ్దంగా ఉన్నారు. ఇప్పుడు ఒప్పందానికి ఓకే చెప్పిన తరవాత కాంగ్రెస్, కమ్యూనిస్టులు విమర్శలు చేస్తున్నారు. ఇదే వారి నాయకత్వ లోపానికి, అంతర్జాతీయ అవగాహన లేదనడానకి నిదర్శనంగా చూడాలి. ప్రపంచీకరణ కారణంగా కష్టపడే వారికి ఉపాధి అవకాశాలకు కొదవ లేదు. జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. ఫలితంగా మనవాళ్లు ఏదేశమైన వెళ్లి పనిచేసుకోగలుగుతున్నారు. రాజకీయ పార్టీలు ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా సాగాలి. అవి మన ప్రజలకు ఎలా ఉపయోగమో ఆలోచన చేయాలి. అలా చేయకపోవడం వల్లనే కాంగ్రెస్, కమ్యూనిస్టులు కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమయ్యారు. యువతరానికి పూర్తిగా దూరమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఆలోచనా పరులు లోపించారు. ఒకరిద్దరు రాహుల్‌ను కంట్రోల్ చేస్తున్నారు. అందుకే ఆయన ఆలోచనలు ఎంతసేపు మోడీని దింపడమెలా అన్న ధోరణిలో సాగుతున్నారు. మోడీని దింపేముందు మోడీ పనులను నిలదీఏ ప్రయత్నాలు చేయడం లేదు. మోడీని దోషజగా నిలబెట్టే యత్నాలు చేయడం లేదు. తొలి తరం కాంగ్రెస్ నాయకత్వం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించింది. ఆ తర్వాత దశలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటీకరణను ప్రోత్సహించారు. పివి నరసింహారావు సంస్కరణ పుణ్యమా అని ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పేదల సంక్షేమం చేపట్టవచ్చని నమ్మారు. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగి, మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీ నాయకుడి చర్యలు కాలానుగుణంగా ఉండడం లేదు. ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీ, పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లు అనుసరించిన విధానాలను రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం వల్ల దౌర్భాగ్యంగా చూడాలి. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణంగా వ్యూహా రచన చేస్తూ భారతీయ జనతా పార్టీని విజయపథంలో నిలబెడుతున్నారు. '75 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ యువతను ఆకర్షించడానికి కారణం ఏమిటన్నది ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్ తన నాయకత్వ పటిమను బలపర్చుకోకుంటే రాణించడం కలష్టమన్న విషయం రాహుల్ ఎంత తొందరగా గుర్తిస్తే అంతమంచిది.

# మలేసియాలో త్వరలో కొత్త కాన్స్యులేట్

- కౌలాలంపూర్‌లో ప్రధాని మోడీ ప్రకటన
- స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు



కౌలాలంపూర్, ఫిబ్రవరి 7: మలేసియాలో త్వరలో కొత్త కాన్స్యులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్ లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మెళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగా సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, అస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. ఇండియాను ఒక పెద్ద మార్కెట్‌గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. మలేసియాను ప్రపంచంలోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్-మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందిరికీ తెలిసిందేనని అన్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియాలోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మెళనం వద్ద 'భారత్ మాతా కీ జై', 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

# అమెరికాతో ఒప్పందం మనకే నష్టం

**మన రైతులకు తీరని అన్యాయం జరగనుంది**

**ఎక్స్ వేదికగా కాంగ్రెస్ జైరామ్ రమేశ్ విమర్శలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** భారత్ అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. అమెరికా వ్యవసాయోత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాల్ని తగ్గించడం వల్ల అమెరికా రైతులకే ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇటీవల విడుదల చేసిన అమెరికా- భారత్ సంయుక్త ప్రకటనలో.. ఆ ఒప్పందంకి సంబంధంచిన వివరాలేమీ లేవు. భారత్ ఇకపై రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకోదనే విషయం మాత్రం స్పష్టంగా తెలుస్తుంది. అలాగే రష్యా నుండి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చమురు కొనుగోలు చేస్తే 25 శాతం జరిమానాను భారత్‌పై తిరిగి విధించ్చని అమెరికా ప్రకటించింది' అని రమేష్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడిని ఆయన విమర్శించారు. ట్రంప్‌తో మోడీ దిగిన ఫోటోలను ప్రస్తావిస్తూ.. 'ఫొటో ఆప్స్ భారతదేశానికి పెద్దగా ప్రయోజనం చేకూర్చలేదని, దౌత్య వైఫల్యాన్ని సూచిస్తున్నాయని ఆయన అన్నారు. భారతీయ రైతులను పణంగా పెట్టి అమెరికన్ రైతులకు సహాయం చేయడానికి భారతదేశం దిగుమతి సుంకాలను తగ్గిస్తుంది. ఈ ఒప్పందంతో అమెరికా నుండి భారత్ వార్షిక దిగుమతులు మూడురెట్లు పెరుగుతాయి. మన దీర్ఘకాల వస్తువుల వాణిజ్య మిగులు తుడిచిపెట్టుకుపోతుంది. భారత్ నుంచి అమెరికాకు ఐటి, ఇతర సేవల ఎగుమతులపై తీవ్ర అనిశ్చితి కొనసాగుతుంది. అలాగే అమెరికాకు ఎగుమతులు చేసే భారత్ వస్తువులపై గతకంటే ఎక్కువ సుంకాలు విధిస్తారు. దీన్నిబట్టి చూస్తే.. ట్రంప్‌ను చేసుకున్న



కౌగిలింతలు, దిగిన ఫోటోలు పెద్దగా ఫలించలేదు. నమస్తే ట్రంప్.. హౌడీ మోడీపై స్కోర్ చేసింది. స్నేహితుడు ఇకపై స్నేహితుడు కాదు అని జైరాం రమేశ్ అన్నారు.

# అగ్ని-3 పరీక్ష విజయవంతం

- భారత అమ్ములపొదిలో మరో అస్త్రం
- చాందీపూర్ వేదికగా సత్తా చాటిన స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్
- 3 వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాల ధ్వంసం
- బ్రహ్మోస్ నుంచి అగ్ని-5 వరకు విస్తృత శ్రేణి క్షిపణులు సిద్ధం

**చాందీపూర్/న్యూఢిల్లీ:** భారత రక్షణ వ్యవస్థలో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేస్తూ 'అగ్ని-3' క్షిపణి పరీక్ష విజయవంతంగా ముగిసింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ వేదికగా స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. నిర్దేశిత సాంకేతిక, కార్యనిర్వహణ లక్ష్యాలన్నింటినీ ఈ క్షిపణి కచ్చితత్వంతో ఛేదించిందని రక్షణ శాఖ అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఈ విజయంతో భారత సైనిక దళాల యుద్ధ సన్నద్ధత మరోసారి రుజువైంది.

## అగ్ని సిరీస్.. అజేయ శక్తి


భారత రక్షణ దళాల వద్ద అగ్ని సిరీస్‌లో వివిధ దూరాలను ఛేదించగల అత్యాధునిక క్షిపణులు అందుబాటులో ఉన్నాయి. తాజా పరీక్షతో ఈ సిరీస్ సామర్థ్యంపై నమ్మకం మరింత పెరిగింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అగ్ని-1 క్షిపణి 700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. దీనిని 220 కిలోమీటర్ల తక్కువ దూరంలోని లక్ష్యాలను ధ్వంసం చేయడానికి కూడా వినియోగించవచ్చని డీఆర్‌డీఓ వర్గాలు తెలిపాయి. అగ్ని-2 క్షిపణి 2 వేల కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంది. తాజాగా పరీక్షించిన అగ్ని-3 క్షిపణి 3 వేల కిలోమీటర్ల దూరంలోని శత్రు స్థావరాలను బూడిద చేయగలదు. అగ్ని-4 క్షిపణి 4 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను తాకగలదు. ఇక అగ్ని-5 అత్యధికంగా 5 వేల కిలోమీటర్ల పరిధిని కలిగి ఉండి, ఖండాంతర క్షిపణిగా దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోంది.

## వ్యూహాత్మక ప్రాధాన్యం

ప్రస్తుతం భారత్ వద్ద 150 నుంచి 300 కిలోమీటర్ల పరిధి కలిగిన 'పృథ్వీ' సిరీస్ క్షిపణులు ఉన్నాయి. వీటికి అనుబంధంగా అగ్ని-1 క్షిపణిని వినియోగించుకునే వెసులుబాటు ఉంది. పృథ్వీకి, అగ్ని-2కు మధ్య ఉన్న దూరాన్ని (గ్యాప్) అగ్ని-1 భర్తీ చేస్తుంది.

## శత్రుదేశాలకు సింహస్వప్నం

భారత రక్షణ దళాల వద్ద ఇప్పుడు బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణుల మిశ్రమ శక్తి ఉంది. ఒకవైపు బ్రహ్మోస్ వంటి సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, మరోవైపు అగ్ని వంటి బాలిస్టిక్ క్షిపణులతో భారత్ పటిష్టంగా ఉంది. ఫలితంగా 30 కిలోమీటర్ల అతి తక్కువ దూరం నుంచి.. ఏకంగా 5 వేల కిలోమీటర్ల అత్యంత ఎక్కువ దూరం వరకు శత్రుదేశాలలోని ఏ లక్ష్యాన్నైనా సులువుగా ధ్వంసం



చేయగల సత్తా భారత్ సొంతమైందని రక్షణ రంగ విశ్లేషకులు చెబుతున్నారు.

## ప్రపంచ దేశాల ఆసక్తి

భారతీయ క్షిపణుల కచ్చితత్వం, సాంకేతిక పనితీరు పట్ల వివిధ దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు భారత ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయి. తాజా విజయంతో రక్షణ రంగ ఎగుమతుల్లోనూ భారత్ తన ముద్ర వేసే అవకాశం ఉంది.

# హెచ్-1బీ వీసాలపై ఆధారపడాల్సిన అవసరం లేదు

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్**

**ఢిల్లీ:** ఐటీ రంగం అభివృద్ధి కోసం హెచ్-1బీ వీసాలపై ఆధారపడాల్సిన అవసరం ఇక ఎంతమాత్రం లేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తాజాగా వ్యాఖ్యానించారు. గ్లోబల్ మార్కెట్స్‌లో భారత ఐటీ సంస్థల కార్యకలాపాల్లో చాలా మార్పు వచ్చాయని అన్నారు. ఓ జాతీయ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్-1బీ వీసాలపై అమెరికా నుంచి ఏమైనా హామీలు వచ్చాయా? అన్న మీడియా ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. వీసాల అవసరం క్రమంగా తగ్గుతూ వస్తోందని మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. కరోనా సంక్షోభానికి ముందే ఈ ఒరవడి ప్రారంభమైందని చెప్పారు. హెచ్-1బీ వీసా లాటరీ కారణంగా పలు సంస్థలు స్వల్ప సంఖ్యలో ఉన్న వీసాల కోసం అధికంగా దరఖాస్తులను సమర్పించాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. కొవిడ్ తరువాత ప్రపంచం ఎంతో మారిపోయిందని, నాటి రోజులు ఎప్పుడో పోయాయని వ్యాఖ్యానించారు. హెచ్-1బీ వీసా అంశంపై అమెరికాతో చర్చించాలని తనను ఏ కంపెనీ కరోనా సంక్షోభం తరువాత అభ్యర్థించలేదని మంత్రి తెలిపారు. ఒకప్పుడు అమెరికాలో ఆన్‌సైట్‌లో చేసిన పనిని భారత్ నుంచే రిమోట్‌గా చేయొచ్చన్న విషయాన్ని కంపెనీలు గుర్తించాయని అన్నారు. అమెరికాలో హెచ్-1బీ వీసా ఉద్యోగులకు సంస్థలు భారీగా జీతాలు చెల్లించాల్సి వచ్చేదని కూడా అన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) పనుల ఔట్‌సోర్సింగ్‌తో అటు కంపెనీలకు ఇటు భారత ఆర్థిక వ్యవస్థకు లాభం కలుగుతుందని చెప్పారు. భారత్‌లో ప్రస్తుతం 1800



పైచిలుకు జీసీసీలు ఉన్నాయని అన్నారు. వీటితో ఉద్యోగాలు, ప్రభుత్వానికి పన్ను ఆదాయం లభిస్తోందని అన్నారు. ఉద్యోగులు తమ కుటుంబాలకు దగ్గరగా ఉండగలుగుతున్నారని అన్నారు. గ్లోబల్ సంస్థల లాభదాయకత కూడా పెరుగుతోందని చెప్పారు.

# కోదాడలో రాజకీయ అగ్గి రాజుకుంది

- జర్నలిస్టులపై దాడి కలకలం
- కాంగ్రెస్ అక్రమాలపై పేలిన బాంబో ఎక్స్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఘాటు వార్నింగ్




**నేటి సాక్షి,మునగాల:** కోదాడ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ పరిస్థితులు ఉత్కంఠభరితంగా మారాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు మద్యం, డబ్బులు పంచుతున్నారని తీవ్ర ఆరోపణలు వెలుగులోకి రావడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ ఘటనను వీడియోలో చిత్రీకరిస్తున్న జర్నలిస్టులపై దాడి జరగడం పెద్ద సంచలనం సృష్టించింది. మీడియా స్వేచ్ఛను అణచివేయాలనే ప్రయత్నంగా ఈ ఘటనను రాజకీయ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. ఈ ఘటనపై కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నాయకులు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే విధంగా డబ్బులు, మద్యం రాజకీయాలు చేస్తున్నారని, అక్రమాలను బయటపెడుతున్న మీడియాపై దాడులు చేయడం ప్రజాస్వామ్య గొంతుని నొక్కివేయడమేనని మండిపడ్డారు. అలాగే మీడియాపై దాడి అంటే కాంగ్రెస్ నాయకులు ప్రజాస్వామ్యంపై యుద్ధం ప్రకటించినట్టే అన్నారు. డబ్బు, మద్యం రాజకీయాలతో ఓట్లు కొనాలనుకునే వారికి కోదాడలో స్థానం లేదు అని గట్టిగా హెచ్చరించారు. జర్నలిస్టులను బెదిరించే గుండాలు చట్టం ముందు నిలబడక తప్పదు అని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలి హెచ్చరించారు. కోదాడ మున్సిపల్ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే కోదాడలో భారీ ఉద్యమాలకు బిఆర్ఎస్ పార్టీ సైనికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, కాంగ్రెస్ నాయకుల అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్స్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అధికారులను గట్టిగా హెచ్చరించారు.

# అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలి





- మెట్‌పల్లిలో బీజేపీ రాష్ట్ర ఇంచార్జీ అభయ్ పటేల్‌కు ఘన స్వాగతం
- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర ఇంచార్జీ

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాల పర్యటనలు చేస్తున్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జీ అభయ్ పటేల్‌కు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఆత్మీయంగా సత్కరించారు.

### పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కారం

మెట్‌పల్లి పట్టణానికి వచ్చిన సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జీ అభయ్ పటేల్‌ను పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి పార్టీ శ్రేణులు గౌరవం తెలిపారు.

### పార్టీ కార్యాలయంలో కీలక సమావేశం

అనంతరం మెట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఇంచార్జీ అభయ్ పటేల్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీలు, పార్టీ ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

### ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలవాలి


పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించాలని అభయ్ పటేల్ పిలుపునిచ్చారు. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలసి బీజేపీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి పార్టీకి ఓటు వేసేలా కృషి చేయాలని సూచనలు, సలహాలు ఇచ్చారు.

### ఎన్నికల విషయంలో కార్యకర్తల పాత్ర కీలకం

మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే వార్డు స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ బలంగా పనిచేయాలని, ఎన్నికల ఇంచార్జీలు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. కార్యకర్తల కృషితోనే బీజేపీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి బీజేపీ ఎన్నికల ఇంచార్జీ అద్మాపూర్ రాజేష్, ఎన్నికల జోనల్ ఇంచార్జీలు, వార్డు ఇంచార్జీలు వడ్డేపల్లి శ్రీనివాస్, ఏలేటి నరేందర్ రెడ్డి, బద్దం గంగాధర్ రెడ్డి, పీసు రాజేందర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో 'కారు'కు శిక్ష ఖాయం..

- అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం!
- అధికారం లేని బీఆర్ఎస్, నిధుల్లేని కాంగ్రెస్‌తో పట్టణాలకు భవిష్యత్ లేదు
- మున్సిపల్ ఎన్నికల వేళ ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు విమర్శలు
- గజ్వేల్‌కు 'అమృత్ సిటీ' హోదా తెస్తాం.. మోదీతో మాట్లాడి అభివృద్ధి చేస్తాం
- ప్రాజెక్టుల పేరిట రైతుల కడుపు కొట్టారు.. ముంపు బాధితుల ఉసురు తగులుతుంది



**నేటి సాక్షి గజ్వేల్ ప్రజ్ఞాపూర్:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో రాజకీయ వేడి పరాకాష్టకు చేరింది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం గజ్వేల్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు ఓటేస్తే ఒరిగేదేమీ లేదని, ఖజానా ఖాళీ అయిన కాంగ్రెస్‌తో పట్టణాల అభివృద్ధి అసాధ్యమని ఆయన తేల్చి చెప్పారు. నిజమైన ప్రగతి కేవలం బీజేపీతోనే సాధ్యమని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మల్లన్నసాగర్, కొండా పోచమ్మ సాగర్ ప్రాజెక్టుల పేరుతో వేలాది ఎకరాల రైతుల భూములు లాక్కున్నారని ఈటల మండిపడ్డారు. భూములు స్వాధీనం చేసుకునే సమయంలో ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదని, ముంపు రైతుల పరిస్థితి నీటి నుంచి బయటపడ్డ చేపలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్ఆర్ కాలనీలు గత ప్రభుత్వ అరాచకాలకు సజీవ సాక్ష్యాలని, రైతుల కడుపు కొట్టిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన శిక్ష విధిస్తారని హెచ్చరించారు. మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఈటల పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి గజ్వేల్‌కు 'అమృత్ సిటీ' హోదా తీసుకువస్తామని, భారీ నిధులతో నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గెలిచిన ఎమ్మెల్యేలకే నిధుల్లేని స్థితిలో మున్సిపాలిటీలకేం చేస్తారని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్ కౌన్సిలర్లు గెలిస్తే ప్రభుత్వ సహకారం ఉండదు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మున్సిపాలిటీలు పాలకుల స్వార్థ ప్రయోజనాల కేంద్రాలుగా మారతాయి. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తాం."–ఈటల రాజేందర్, ఎంపీ ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఎన్నికల ఇన్చార్జి ఆకుల విజయ్, పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ తదితర నేతలు పాల్గొన్నారు.

## ముస్త్యాలలో ఎన్ఎస్ఎస్ ర్యాలీ




**నేటి సాక్షి చేర్యాల:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేర్యాల జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో ముస్త్యాల గ్రామంలో శీతాకాల శిబిరం 4 రోజు శనివారం ముస్త్యాల గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది చెత్త వేయకు పాపం చేయకు యువత మేలుకో మత్తు వదులుకోఅంటూ గ్రామంలోని అన్ని వీధులలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. విద్యార్థులను ఉద్దేశించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ గంగయ్య మాట్లాడుతూ గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు అవి బాగున్నప్పుడే దేశం బాగుంటది అదేవిధంగా ప్రతి మనిషి పరిశుభ్రత సమాజ పరిశుభ్రత సిహెచ్



యాదగిరి మాట్లాడుతూ కష్టం ద్వారా ఏదైనా సాధించవచ్చు మరియు చదువు లేని వ్యక్తి సమాజంలో ఏమి చేయలేడు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి సమాజానికి తన యొక్క కుటుంబానికి మేలు చేయగలడుఅని విద్యార్థులకు సూచించారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు వాలంటీర్లు పాల్గొన్నారు

## రాజనాల బండ పై విశేష పూజలు

**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** రాష్ట్రంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన మండలంలోని రాజనాల బండ పై శనివారం విశేష పూజలు జరిగాయి టీటీడీ ఆధ్వర్యంలో ఉదయాన్నే ప్రధానార్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీ నరసింహ స్వామి క్షేత్రపాలకుడు ప్రసన్న ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదాలు వేసుకొని వెళ్లారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు టీటీడీ సిబ్బంది సేవలు అందించారు

## మంత్రి కార్యక్రమం

### విజయవంతం చేయగలరు మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:** దుబ్బాక మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జీ మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి గారు, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు, విశిష్ట అతిథులుగా దుబ్బాక నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి గారులి విచ్చేస్తున్నారు కావున ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,ఆత్మ కమిటీ డైరెక్టర్లు గౌరవ సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, NSUI యూత్ కాంగ్రెస్,సోషల్ మీడియా నాయకులు, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు.

# క్రీడా కిట్ పంపిణీ

**చదువుతో పాటు ఆటలు కూడా అవసరం**





**నేటి సాక్షి, జగిత్యాల ( గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని శనివారం రోజున ఆవుల వెంకటేష్ కుమారుడు ఆవుల అఖిలేష్ ఏడవ పుట్టినరోజు సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్లో పిల్లలు ఆడుకోవడానికి మానసిక ఉల్లాసంగా ఉండడానికి క్రీడా కిట్ పంపిణీ చేశారు.అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ పిల్లలకి చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమే అని అన్నారు.హాస్టల్ పిల్లలు మరియు టీచర్లు అఖిలేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ పద్మ,శైలజ,జలజ,జ్యోతి రాణి, పి ఈ టి, వనజ,ఆవుల వెంకటేష్ ఆవుల రాజశేఖర్,ఎల్పుల సురేష్ ఎల్పుల ల రాము, మారం తిరుపతి, ఆవుల సాయి బోడపట్ల మధు కొండ మహేష్, తదితరులు పాల్గొన్నారు

# అంగన్‌వాడి కేంద్రాలకు భూమిపూజ



**నేటి సాక్షి, తొగుట:** దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తొగుట మండల కేంద్రంలో మూడు అంగన్‌వాడి కేంద్రాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. తొగుట సర్పంచ్ శోభ కొండల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా AMC చైర్మన్ చెరుకు విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ICDS సూపర్వైజర్ శ్రీలేఖ, అంగన్‌వాడి టీచర్లు వసంత, అనిత, మాధవి, ఉప సర్పంచ్ తిరుపతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు భరత్ తేజ, వార్డు సభ్యులు వినోద్, మధురెడ్డి, పవన్ రెడ్డి, కాసర్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పురస్కార కార్యక్రమం

**ముఖ్య అతిథిగా డా. ముసా అలీఖాన్**



**నేటి సాక్షి, మిర్యాలగూడ:** అల్లూరి సీతారామరాజు జాతీయ పురస్కార అవార్డు ప్రధానోత్సవానికి మిర్యాలగూడకు చెందిన డా. ముసా అలీఖాన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఫిబ్రవరి 11, 2026న విజయవాడలో మదర్ సర్వీస్ సొసైటీ ఎన్జీవో ఫౌండర్ డా. మల్లాది ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డా. ముసా అలీఖాన్ మాట్లాడుతూ, తనకు లభించిన ఈ ఆహ్వానం గొప్ప గౌరవమని, అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు నిరంతరం సహకరిస్తున్న మీడియా ప్రతినిధులు, మిత్రులు, శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా సీఎం కప్ నియోజకవర్గ స్థాయి క్రీడలు




**నేటి సాక్షి, నారాయణపేట :** నారాయణపేట నియోజకవర్గ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు శనివారం మరికల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం మరియు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు జరిగిన ఈ పోటీల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్రీడాకారుల మార్చ్‌పాస్ట్ నిర్వహించగా, మండల విద్యాధికారి కలీముల్లా, గ్రామ సర్పంచ్ చెన్నయ్య, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నమ్మ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. సూర్యమోహన్ రెడ్డి భోజనదాతగా, బహుమతుల దాతగా వ్యవహరించి క్రీడాకారులను ప్రోత్సహించారు. సీఎం కప్ పోటీలు క్రీడాకారులకు ప్రతిభను చాటుకునే వేదికగా నిలుస్తాయని ఆయన తెలిపారు. డీవైఎస్ఓ వెంకటేష్ శెట్టి, ఎస్‌జీజీఎఫ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి క్రీడల ప్రాధాన్యతను వివరించారు. సుమారు 350 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొనగా, విజేతలకు సాయంత్రం బహుమతులు అందజేశారు. తదుపరి జిల్లా స్థాయి పోటీలు నారాయణపేటలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, హరీష్ వేమ, ఉపాధ్యాయులు నరసింహులు, రత్నయ్య, వెంకటేష్, రవికుమార్, బాలరాజు, వెంకటప్ప, సాయినాథ్, జ్యోతి, రామకృష్ణారెడ్డి, బసంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐసిఆర్పి సుమిత్ర కుటుంబాన్ని ఆదుకోవాలి.





- **ఎక్స్ గ్రేసియో 5లక్షలు చెల్లించాలి...ఎం.రమేష్ బాబు,ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్**

**నేటి సాక్షి నంద్యాల :** నంద్యాల జిల్లా , సంజామల మండలం, రెడ్డిపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటి నాచురల్ ఫామ్‌లో ICRPగా అనేక సంవత్సరాలనుండి విధులు నిర్వహిస్తున్న సుమిత్ర అకస్మాత్తుగా మరణించడం చాలా బాధాకరమని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సుమిత్ర గారి కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్రము లో ఏపీసీఎన్ఎఫ్ లో పని చేస్తున్న అన్ని రకాల క్యాడర్ సిబ్బందికి ఎక్స్ర్పెగ్రేసీయ్ , హెల్త్ కార్డు, పి ఎఫ్, ఈఏస్ఐ సౌకర్యం కల్పించాలని ఏపీ ప్రకృతి వ్యవసాయం ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ బాబు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామద్దయ్య, రామాంజి లు ఒక ప్రకటన లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రం లో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నాచురల్ ఫామ్ ను గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలని సంకల్పం చేస్తుందని అయితే అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదని ప్రమాదం జరిగితే హెల్త్ కార్డు,ఎక్స్గ్రేగ్రేషియ లేని దుర్భర మైన పరిస్థితి ఉందన్నారు. అనేకమంది ఎన్నో ప్రమాదాల్లో మరణించిన వారికి ఏమాత్రం ప్రభుత్వం సాయం చేయడం లేదన్నారు. ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వీరికి మాత్రం ఎలాంటి హెల్త్ కార్డు లేదన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించకపోవడం చాలా దారుణం అన్నారు. తక్షణమే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు.ఈ విషయంపై రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.సుమిత్ర కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నామన్నారు..

# బీజేపీ,బీఆర్ఎస్‌కు ఓటు అంటే చెత్తబుట్టలో వేసినట్టే





- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**నేటి సాక్షి - కోరుట్ల (రాధారపు నర్సయ్య):** బీజేపీ లేదా బీఆర్ఎస్‌కు ఓటు వేయడం అంటే ఆ ఓటును చెత్తబుట్టలో వేసినట్టేనని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కోరుట్ల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని పలు కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ఆయన మాట్లాడుతూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలతో మాట్లాడుతూ చేతి గుర్తుతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలు తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీకి వేసి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కోరుట్లలో జువ్వాడి నర్సింగ్ రావు ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కోరుట్ల మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అభివృద్ధికి భారీ నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే కోరుట్ల నియోజకవర్గానికి రూ.18.70 కోట్ల నిధులు మంజూరై సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల మంజూరు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్ రావు మాట్లాడుతూ స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు అభివృద్ధి బాటలోనే కోరుట్ల ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చింతకుంట మీసేవ కేంద్రంపై ఫిర్యాదు



- **నిరుద్యోగ యువకులకు కేటాయించాలని గ్రామస్థుల డిమాండ్**

**నేటి సాక్షి - కథలాపూర్:** కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలో మీసేవ కేంద్రం ఏళ్లుగా పనిచేయకుండా మూతపడివుందని ఆరోపిస్తూ గ్రామ యువకులు కోరుట్ల ఆర్‌డీఓ జీవాకర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. కేంద్ర నిర్వాహకుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే మీసేవను నిర్లక్ష్యం చేస్తున్నాడని, ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ-నివాస సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ యువకుల కథనం ప్రకారం, చింతకుంట మీసేవకు కేటాయించిన సాఫ్ట్‌వేర్‌ను వేరే ల్యాప్‌టాప్‌లో వినియోగిస్తున్నట్లు ఆరోపించారు. అలాగే నిర్వాహకుడు కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య మిత్రగా పనిచేస్తూ మీసేవ సేవలను అందించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవీందర్, రెవెన్యూ ఆఫీసర్ సుధాకర్ గ్రామానికి వెళ్లి పరిశీలించగా, మీసేవ కేంద్రం తాళం వేసి ఉండటం గమనించారు. ఇప్పటికే ఉద్యోగంలో ఉన్న వ్యక్తి నుంచి మీసేవను రద్దు చేసి, నిరుద్యోగ యువకులకు కేటాయించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. పూర్తి వివరాలతో నివేదికను ఆర్‌డీఓకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# అమెరికాపై భారత్ గెలుపు

## 29 పరుగుల తేడాతో టీమిండియా విక్టరీ.!

**ఇండియా : 169/9, అమెరికా : 132/8.**




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్, అమెరికా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన వినోదాన్ని పంచింది. పటిష్టమైన భారత జట్టును అమెరికా బౌలర్లు, బ్యాటర్లు ఒకానొక దశలో భయపెట్టినప్పటికీ, సమష్టి కృషితో రోహిత్ సేన విజయం సాధించి పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. 29 పరుగుల తేడాతో గెలిచిన భారత్, తదుపరి రౌండ్ దిశగా కీలక అడుగు వేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి షాక్‌లు తగిలాయి. అమెరికా బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో భారత టాప్ ఆర్డర్‌ను కట్టడి చేశారు. ఓపెనర్లు స్వల్ప స్కోరుకే వెనుదిరగడంతో భారత్ కష్టాల్లో పడింది. అయితే, ఈ క్లిష్ట సమయంలో మిడిలార్డర్ బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి భారత్ 161 పరుగులు చేసింది. అమెరికా బౌలర్లలో భారత సంతతి ఆటగాళ్లు అద్భుతమైన స్పెల్స్‌తో ఆకట్టుకోవడం విశేషం. 162 పరుగుల లక్ష్య ఛేదనలో అమెరికా జట్టు ఏమాత్రం తలవంచకుండా పోరాడింది. భారత స్టార్ బౌలర్ల ధాటికి వికెట్లు కోల్పోయినప్పటికీ, రన్ రేట్‌ను కాపాడుకుంటూ విజయంపై ఆశలు రేకెత్తించింది. ముఖ్యంగా మిడిలార్డర్‌లో అమెరికా బ్యాటర్లు సిక్సర్లు, ఫోర్లతో భారత ఫీల్డర్లకు పని చెప్పారు. అయితే, మ్యాచ్ కీలక దశకు చేరుకున్న సమయంలో భారత సీనియర్ బౌలర్లు తమ అనుభవాన్ని ఉపయోగించి వికెట్లు పడగొట్టారు. డెత్ ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో అమెరికా లక్ష్యానికి 29 పరుగుల దూరంలోనే నిలిచిపోయింది. ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ ప్రమాణాలు కూడా గెలుపులో కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా బౌండరీ లైన్ వద్ద పట్టిన క్యాచ్‌లు మ్యాచ్ గమనాన్ని మార్చేశాయి. అమెరికా జట్టు ఈ మెగా టోర్నీలో తమ పోరాట పటిమతో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించింది. భారత్ గెలిచినప్పటికీ, పసికూనల నుండి ఎదురైన ఈ స్థాయి పోటీ టీమిండియా మేనేజ్‌మెంట్‌కు రాబోయే పెద్ద మ్యాచ్‌ల కోసం కొన్ని హెచ్చరికలను పంపింది.

# పాక్ జట్టుపై దారుణంగా ట్రోలింగ్



ప్రపంచంలోని 14వ ర్యాంక్ జట్టు నెదర్లాండ్స్ మాజీ ఛాంపియన్ పాకిస్తాన్‌ను దాదాపు ఓడించినంత పని చేసింది. 2026 ౹20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో పాకిస్తాన్ చివరి ఓవర్లలో అతికష్టమ్మీద నెగ్గింది. ఫహీమ్ అష్రఫ్ 19వ ఓవర్లో 24 పరుగులు సాధించడంతో పాక్ పరువు నిలిచింది. పాకిస్తాన్ జట్టు పొట్టి ప్రపంచ కప్ తొలి మ్యాచులో ర్యాంకింగ్‌లో చాలా కింద ఉన్న నెదర్లాండ్స్‌తో అతికష్టం మీద నెగ్గడంపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతోంది. బాబర్ ఆజం ఫ్లాప్ షో, పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా కూడా రాణించలేదు. ఫహీమ్ అష్రఫ్ చివర్లో రాణించకపోతే అంతర్జాతీయ వేదిక మీద ఎక్స్‌ట్రాలు చేసిన పాక్ పరువు పోయేదే. అష్రఫ్ చివరి ఓవర్లలో 11 బంతుల్లో 29 పరుగులు చేయడంతో నెదర్లాండ్స్ మీద పాక్ విజయం సాధించింది. ఒక సోషల్ మీడియా యూజర్ ఇలా పోస్ట్ చేశాడు. పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఎందుకు టీమ్ ఇండియాతో ఆడదో ఇప్పుడు అర్థమైంది. నెదర్లాండ్స్‌తో ఇలా ఉంటే, భారత్‌తో ఆడితే ఏమవుతుందో అని... పాకిస్తాన్ జట్టును చిన్న జట్టు దాదాపు బట్టలూడదీసినంత పని చేసిందన్నాడు.

పాక్ తాజా ప్రదర్శన ఈ ౹20 ప్రపంచ కప్ నెగ్గడం పాకిస్తాన్ కు అంత తేలిక కాదని స్పష్టం చేసింది. మహ్మద్ కైఫ్ కామెంటరీ సమయంలో పాకిస్తాన్‌ను ట్రోల్ చేశారని ఒక భారత అభిమాని పేర్కొన్నాడు.హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు నెదర్లాండ్స్‌ను 3 వికెట్ల తేడాతో ఓడించింది. ఫహీమ్ అష్రఫ్ రాణించి తృటిలో ఓటమిని తప్పించాడు. లేకుంటే పాకిస్తాన్ ౹20 ప్రపంచ కప్‌లో భారీ ఓటమిని చవిచూసేది. కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో, ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 147 పరుగులకే ఆలౌట్ అయింది. పాక్ ఛేజింగ్ అంత తేలిక కాలేదు. చివరి ఓవర్‌లో 3 వికెట్ల తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది.నెదర్లాండ్స్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్, బాస్ డి లీడే 37 పరుగులు, 30 పరుగులు చేశారు. మైఖేల్ లెవిట్ 24, కాలిన్ అకెర్మాన్ 20 పరుగులు చేశారు. పాకిస్తాన్‌కు 148 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. స్వల్ప టార్గెట్ ఛేదించడంలో పాకిస్తాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ 47 పరుగులు చేశాడు. సామ్ అయూబ్ 13 పరుగులు, కెప్టెన్ సల్మాన్ అఘా 12, బాబర్ అజామ్ 15 పరుగులకే ఔటయ్యారు.ఒక ??దశలో పాకిస్తాన్ 2 వికెట్లకు 98 పరుగులు చేసి 58 బంతుల్లో 50 పరుగులు చేస్తే విజయం సాధిస్తుంది. కానీ ఆ తర్వాత, వికెట్ల పతనం ప్రారంభమైంది, ముఖ్యంగా పాల్ వాన్ మీకెరెన్ పాకిస్తాన్ బ్యాటర్లను దెబ్బతీశాడు. పాక్ 100 పరుగులు చేసేలోపే జట్టులో సగం మంది పెవిలియన్‌కు చేరారు. స్కోరు 114 పరుగులకు చేరుకునేలోగా ఆల్ రౌండర్లు, మహ్మద్ నవాజ్, షాదాబ్ ఖాన్ తమ వికెట్లను కోల్పోయారు. 114 పరుగులకే పాకిస్తాన్ 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచుకు చేరింది. ఫహీం అష్రఫ్ చివర్లో 11 బంతుల్లో 29 పరుగులతో రాణించడంతో పాకిస్తాన్ పెద్ద ఓటమిని తప్పించుకుంది.

# భారత్‌తో మ్యాచ్‌కు పీసీబీ గ్రీన్ సిగ్నల్?




టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన మజా ఇచ్చే భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌పై నీలినీడలు తొలగిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లూ భారత్‌తో ఆడేది లేదు అంటూ భీష్మించుకు కూర్చున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఎట్టకేలకు మెత్తబడింది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌పై తమ పంతాన్ని వీడి, యూ-టర్న్ తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. శ్రీలంక క్రికెట్ బోర్డు విజ్ఞప్తి మేరకు, భారత్‌తో తలపడే అంశంపై తమ ప్రభుత్వంతో మాట్లాడతామని పీసీబీ ప్రకటించింది. పాకిస్తాన్ జట్టు ప్రస్తుతం తన గ్రూప్ మ్యాచ్‌లను కొలంబో, పల్లెకెలె వేదికగా ఆడుతోంది. అయితే భారత దేశంతో క్రికెట్ ఆడేందుకు పాక్ ప్రభుత్వం మొదట నిరాకరించింది. దీనివల్ల ఫిబ్రవరి 15న జరగాల్సిన అతిపెద్ద మ్యాచ్ క్యాన్సల్ అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్షుడు శమ్మి సిల్వా నేరుగా పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీకి ఈమెయిల్ పంపారు. భారత్-పాక్ మ్యాచ్ జరగకపోతే శ్రీలంక క్రికెట్‌కు భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని, టికెట్ల ఆదాయం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీలంకకు ప్రస్తుతం ఆర్థికంగా పాక్ మద్దతు అవసరమని బతిమిలాడటంతో పాక్ బోర్డు దిగివచ్చింది.భారత్-పాకిస్తాన్ మ్యాచ్ అంటేనే ఐసీసీకి, బ్రాడ్‌కాస్టర్లకు కాసుల వర్షం. ఈ మ్యాచ్ రద్దయితే కోట్లాది రూపాయల రెవెన్యూ నష్టం జరుగుతుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు చేసిన విజ్ఞప్తిని కాదనలేక, పీసీబీ చీఫ్ ఈ విషయాన్ని తమ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పాకిస్తాన్ ప్రభుత్వం ఇప్పటికే తమ జట్టును టోర్నీ కోసం శ్రీలంక పంపినప్పటికీ, కేవలం భారత్‌తో ఆడేందుకు మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పుడు శ్రీలంక బోర్డు విన్నపంతో పాక్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం.మరోవైపు, టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్తాన్ తన ప్రస్థానాన్ని ఘనంగా ప్రారంభించింది. శనివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో నెదర్లాండ్స్‌ను 3 వికెట్ల తేడాతో ఓడించి బోణీ కొట్టింది. 148 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో పాక్ బ్యాటర్లు తడబడినా, చివరికి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు భారత్‌తో మ్యాచ్‌కు కూడా పీసీబీ మొగ్గు చూపితే, ఫిబ్రవరి 15న కొలంబో స్టేడియం అభిమానుల కేరింతలతో హోరెత్తడం ఖాయం.



## అండర్-19 వరల్డ్ కప్ హీరో

# వైభవ్‌కు షాక్!

## ఇకపై ఆడేందుకు నో ఛాన్స్!

వైభవ్ సూర్యవంశీ.. రాబోయే మరికొన్ని ఏళ్లు ప్రపంచవ్యాప్తంగా బాగా వినిపించే పేరు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. దీనికి కారణం కేవలం అతడి ఆట తీరు. అండర్-19 ప్రపంచ కప్ 2026లో అద్భుత ప్రదర్శనతో వైభవ్ సూర్యవంశీ మరోసారి ప్రపంచానికి తన సత్తా ఏంటో రుచి చూపించాడు. కేవలం 14 ఏళ్ల వయస్సులోనే ఇంగ్లాండ్ తో జరిగిన ఫైనల్ లో 80 బంతుల్లో 175 పరుగులు చేసి భారత్‌ను ఆరోసారి అండర్-19 ప్రపంచ ఛాంపియన్‌గా నిలిపి అనేక అరుదైన రికార్డులను సృష్టించాడు. ఫైనల్‌లో సెంచరీ చేసిన మూడవ భారతీయ ఆటగాడిగా నిలిచిన వైభవ్.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డులను ఒకేసారి అందుకున్న తొలి ఆటగాడిగా చరిత్రలో నిలిచాడు. అయితే ఇప్పుడు ఆశ్చర్యకరంగా.. అతనికి ఇంకా వయస్సు ఉన్న.. ఇకపై అండర్-19 ప్రపంచ కప్‌లో కనిపించడు. దీనికి కారణం.. మార్చి 27, 2011న జన్మించిన వైభవ్ వయస్సు పరంగా చూస్తే 2030 అండర్-19 ప్రపంచ కప్ వరకు అర్హత ఉంది. కానీ బీసీసీఐ అమలు చేస్తున్న నియమాల కారణంగా మరో ఎడిషన్‌లో ఆడే అవకాశం ఉండదు. 2016లో బీసీసీఐ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయం ప్రకారం.. భారత్ తరపున ఒకసారి అండర్-19 ప్రపంచ కప్‌లో పాల్గొన్న ఆటగాడు వయస్సు పరంగా అర్హత ఉన్నప్పటికీ మళ్లీ ఆ టోర్నమెంట్‌లో ఆడకూడదు. అలాగే అండర్-19 లోకి వచ్చిన ఆటగాళ్లు గరిష్టంగా రెండు సీజన్లు మాత్రమే అండర్-19 క్రికెట్ ఆడేలా నిబంధనలు రూపొందించారు. గతంలో వయస్సు మోసాలకు సంబంధించిన సమస్యలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ రూల్ కు ముందు రవీంద్ర జడేజా, విజయ్ జోల్, అవేష్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్, రికీ భూయ్ వంటి ఆటగాళ్లు రెండు అండర్-19 ప్రపంచ కప్‌లలో పాల్గొన్నారు. కాబట్టి ఈ బీహార్ డైనమేట్ ఇకపై అండర్-19 వరల్డ్ కప్‌లో పాల్గొనలేదు.

## జెమిమా రోడ్రిగ్స్‌కు బీసీసీఐ

# బంపర్ ప్రమోషన్!



భారత మహిళా క్రికెటర్లకు బీసీసీఐ బంపర్ ఆఫర్ ప్రకటించింది. 2026 సీజన్‌కు సంబంధించి కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను సిద్ధం చేసింది. ఈసారి కాంట్రాక్ట్ పొందే ఆటగాళ్ల సంఖ్యను 16 నుంచి 21కి పెంచుతూ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా యువ సంచలనం జెమిమా రోడ్రిగ్స్ దశ తిరిగింది. ఆమె ప్రదర్శనకు మెచ్చిన బీసీసీఐ, జెమిమాను ఏ-గ్రేడ్‌లోకి ప్రమోట్ చేస్తూ జీతాన్ని భారీగా పెంచింది. భారత బ్యాటింగ్ వెన్నెముక జెమిమా రోడ్రిగ్స్‌కు బీసీసీఐ ఈసారి పెద్ద పీట వేసింది. గతంలో గ్రేడ్-బీ లో ఉన్న ఆమెను, ఇప్పుడు గ్రేడ్-ఏ కి ప్రమోట్ చేసింది. దీంతో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, దీప్తి శర్మలతో పాటు జెమిమా కూడా ఏడాదికి రూ.50 లక్షల పారితోషికాన్ని అందుకోనుంది. వరుస విజయాలతో దూసుకుపోతున్న జెమిమాకు ఇది తగిన గుర్తింపు అని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు గ్రేడ్-బీ లో షెఫాలీ వర్మ, రిచా ఘోష్‌లతో పాటు స్నేహ్ రాణా ప్రమోషన్ పొంది చోటు సంపాదించుకున్నారు. వీరికి ఏడాదికి రూ.30 లక్షలు లభిస్తాయి. ఈ ఏడాది కాంట్రాక్ట్ జాబితాలో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఏడుగురు కొత్త ఆటగాళ్లకు తొలిసారి సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. ప్రతికా రావల్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, కాశీ గౌతమ్ వంటి యువ ఆటగాళ్లు గ్రేడ్-సీ లోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ గ్రేడ్‌లో ఉన్న 13 మంది ప్లేయర్లకు ఏడాదికి రూ.10 లక్షల చొప్పున బోర్డు చెల్లిస్తుంది. అయితే సీనియర్ ప్లేయర్ పూజా వస్త్రాకర్, యువ సంచలనం శ్రేయాంక పాటిల్ మాత్రం తమ కాంట్రాక్టులను కోల్పోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. గాయాల కారణంగా దూరమైన హర్లీన్ డియోల్ మళ్ళీ జాబితాలోకి రావడం విశేషం. కాంట్రాక్ట్ మనీతో పాటు మ్యాచ్ ఫీజులను కూడా బీసీసీఐ పటిష్టంగా అమలు చేస్తోంది. మహిళా క్రికెటర్లకు పురుషులతో సమానంగా మ్యాచ్ ఫీజులు ఇస్తున్న సంగతి తెలిసిందే. టెస్ట్ మ్యాచ్ ఆడితే రూ.15 లక్షలు, వన్డేకు రూ.6 లక్షలు, టీ20 మ్యాచ్‌లకు రూ.3 లక్షల చొప్పున ఒక్కో మ్యాచ్‌కు లభిస్తాయి. ఐపీఎల్ వల్ల ఇప్పటికే ఆర్థికంగా బలోపేతమైన మహిళా క్రికెటర్లకు, ఈ కొత్త కాంట్రాక్టులు మరింత ఊతాన్ని ఇస్తాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



# 'ధురంధర్' బ్యూటీ షాకింగ్ రియాక్షన్!

బాలీవుడ్ యంగ్ బ్యూటీ ఆయేషా ఖాన్ 'ధురంధర్'లో 'షరారత్' సాంగ్‌తో ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ అమ్మడు ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉంది. వరుస అవకాశాలు అందుకుంటోంది. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ బ్యూటీ, తనను స్టార్ డాన్సర్లు నోరా ఫతేహి, తమన్నా భాటియాతో పోల్చడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో తనను వారిద్దరితో పోలుస్తూ వస్తున్న రీల్స్‌ను తాను చూశానని, అయితే వారితో తనను పోల్చుకోవడం అస్సలు నచ్చదని క్లారిటీ ఇచ్చింది. "నోరా, తమన్నా అద్భుతమైన మహిళలు. నోరా స్టేజ్ పెర్ఫార్మెన్స్, ఎనర్జీ చూస్తుంటే నాకు ఆశ్చర్యం వేస్తుంది.. తను చేసేది నేను ఎప్పటికీ చేయలేను" అంటూ నోరాపై తనకున్న గౌరవాన్ని చాటుకుంది. ఇక తమన్నా గురించి మాట్లాడుతూ.. "తమన్నా ఎప్పటి నుంచో ఇండస్ట్రీలో ఉంది. ఎన్నో గొప్ప పనులు చేస్తోంది. 'ఆజ్ కీ రాత్' సాంగ్‌లో ఆమెను చూసి నేను ఫిదా అయిపోయాను. నేను ఇండస్ట్రీకి కొత్త, ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది" అని ఆయేషా చెప్పుకొచ్చింది. ఎవరైనా తనను వారితో పోల్చితే తనకు సంతోషం కలగదని, వారి జర్నీ వేరని స్పష్టం చేసింది. అదే విధంగా తన కో-స్టార్ క్రిస్టల్ డిసౌజాతో మనస్పర్థలు ఉన్నాయనే వార్తలను కూడా ఆమె కొట్టిపారేసింది. తామిద్దరం అప్పుడప్పుడు కలుస్తూనే ఉంటామని, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా ఆయేషా ఖాన్ క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి.

# సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

ట్రైలర్ లాంచ్‌లో పాల్గొన్న అనిల్ రావిపూడి

శివాజీ - లయ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 12 నుంచి ఈటీవీ విన్ వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నా సినిమాలో హీరోలే నాకు దేవుళ్లు. వాళ్లను అలానే చూస్తాను. ఈ సినిమాలో లయ కొత్తగా కనిపించనున్నారు. శివాజీ సినిమాను ఎంత ప్రేమిస్తారో అందరికీ తెలిసిందే. 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అందరినీ నవ్విస్తుంది. ఈ ఈవెంట్‌కు పిలవడం కోసం శివాజీ ఫోన్ చేసినప్పుడు ఒక మాట చెప్పాడు. 'ఈసారి జాగ్రత్తగా మట్లాడతాను' అని చెప్పారు. కచ్చితంగా వస్తానన్నాను' అని అనిల్ రావిపూడి అన్నారు. ఈ సినిమా నవ్విస్తుందా.. భయపెడుతుందా? అనగా..నవ్విస్తూ.. భయపెడుతుంది. చివరి వరకూ ఉత్కంఠ ఉంటుందని శివాజీ అన్నాడు. 50ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా నిర్మాతగా మారే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అంటే.. అనిల్ రావిపూడి హీరోగా చేస్తే.. నేను నిర్మాతను అవుతా. ఎందుకంటే అనిల్ మల్టీటాలెంటెడ్ అని కితాబునిచ్చారు. నా కెరీర్ పూర్తయిందని అనుకున్నాను. ఆ సమయంలో ఓటీటీ వచ్చింది. అలా మరోసారి నా కెరీర్ ఊపందుకుంది. నా 30 ఏళ్ల కెరీర్‌లో నేను నటించిన అన్ని సినిమాలు హిట్ అయ్యాయి. 99 శాతం విజయం సాధించాయని శివాజీ అన్నాడు. నేను ఈ పాత్ర గురించి చెప్పినప్పుడు ఇలా ఉంటుందని అనుకోలేదు. తన కుటుంబం కోసం ఏమైనా చేసే పాత్ర ఇది. అందుకే అలా అనిపిస్తుంది. సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టాక మీరు అనుకున్న పాత్రలు రావడం లేదనే బాధ ఏమైనా ఉందా? సక్సెస్ ఉంటే ప్రతి మనిషికి కచ్చితంగా ఎనర్జీ వస్తుంది. ఆడియన్స్‌కు మన నటన నచ్చుతుంది అని అర్థం అవుతుంది.






## గ్లోబల్ బ్యూటీకి మరో బంపర్ ఆఫర్

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఇండియన్ సినిమా బాక్సాఫీస్‌పై దండయాత్రకు సిద్ధమైంది. అటు టాలీవుడ్, ఇటు బాలీవుడ్ నుంచి భారీ ప్రాజెక్టులతో ఆమె వార్తల్లో నిలిచింది. దర్శకధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' తో ఆమె టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వనుంది. ఈ సినిమాలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనుండగా, ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఇదిలా ఉంటే.. తాజాగా, ప్రియాంక చోప్రాకు సంబంధించిన మరో హాట్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజీ 'క్రిష్-4'లో ఆమె లీడ్ రోల్‌లో కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మళ్లీ ప్రియాంకనే హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. హృతిక్-ప్రియాంక జోడీగా గతంలో వచ్చిన 'క్రిష్' సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న నేపథ్యంలో, అదే మ్యాజిక్‌ను మరోసారి రిపీట్ చేయాలనే ఆలోచనతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో చాలా ఏళ్ల విరామం తర్వాత ప్రియాంక చోప్రా బాలీవుడ్‌లో గ్రాండ్ కంబ్యాక్ ఇవ్వనుంది.




# సిద్ధూ జొన్నలగడ్డ కొత్త చిత్రం

టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ కొత్త సినిమాను ప్రారంభించాడు. శనివారం ఫిబ్రవరి7 ఆయన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ప్రస్తుతం సరైన హిట్లు లేక సతమవుతున్న సిద్దు తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జే (ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ ఫేమ్) తో చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం 'ప్రొడక్షన్ నెం. 40'గా పిలుస్తున్న ఈ సినిమాకు సంబంధించి త్వరలోనే మరిన్ని వివరాలను చిత్రబృందం వెల్లడించనుంది. సిద్ధు తనదైన శైలిలో మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారని ఈసారి బాక్సాఫీస్ వద్ద బ్లాస్ట్ ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తూ సిద్ధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. సితార బ్యానర్‌లో సిద్ధుకి ఇది హ్యాట్రిక్ సినిమా కావడం విశేషం

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 9666052221

# రక్తదానంలో.. 99 నాటౌట్.!

**అత్యవసర పరిస్థితిలో ఎస్డిపి ప్లేట్‌లెట్స్ దానం చేసిన మహ్మద్ బాబుజాన్**

**రక్తం, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ కలిపి 99వ సారి డొనేషన్‌తో ప్రాణదాతగా గుర్తింపు**



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లా లింగంపేట్ గ్రామానికి చెందిన కార్తీక్ అనే యువకుడికి అత్యవసర పరిస్థితిలో BSDP ప్లేట్‌లెట్స్ అవసరమని సమాచారం అందగానే, ప్రాణదాత మహ్మద్ బాబుజాన్ వెంటనే స్పందించి ప్లేట్‌లెట్స్ దానం చేశారు. బాధితుడి బంధువులు ఫోన్ ద్వారా సంప్రదించడంతో ఎలాంటి ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకుని వాణ్రా డొనేషన్ చేయడం ద్వారా మరో ప్రాణాన్ని నిలబెట్టారు.

**అత్యవసర కాల్‌కు స్పందించిన ప్రాణదాత**

రక్తదానం, ప్లాస్మా దానం, ప్లేట్‌లెట్స్ అన్నీ కలిపి ఇది తన 99వ డొనేషన్ కావడం విశేషం. అత్యవసర పరిస్థితుల్లో ముందుండి సేవలందిస్తున్న మహ్మద్ బాబుజాన్, మరిన్ని యువత రక్తదానం, ప్లేట్‌లెట్స్ దానం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరిమాసంలో పుట్టినరోజు జరుపుకుంటున్న సమస్త ప్రాణదాతలకు ఈ డొనేషన్‌ను అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

# పరుగు పోటీకి యువకుడి ఎంపిక



**నేటి సాక్షి బుగ్గారం:** బుగ్గారం మండలం శేకల్ల గ్రామానికి చెందిన దొనకొండ అజయ్ అనే యువకుడు 100 మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. చిన్ననాటి నుండి ఆటలలో అభిరుచి ఎక్కువగా ఉండడం వల్ల పట్టుదలతో జిల్లా స్థాయి పరుగు పందెంలో ఎంపికయ్యారని అజయ్ తల్లిదండ్రులు తెలిపారు. శనివారం నాడు పరుగుపందంలో ఎంపికైన అజయ్ ని గ్రామ సర్పంచ్ పర్స రమేష్ సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువత మొబైల్ ఫోన్, ఆల్కహాల్ మద్యం లాంటి వ్యసనాలకు అలవాటు పడకుండా ఆటల పట్ల అభిరుచి పెంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అదేవిధంగా మానసిక అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వార్డు సభ్యులు నంది తిరుపతి తదితరులు ఉన్నారు

# స్పందించిన వ్యవసాయ అధికారి

**శ్రీధర్ రెడ్డి. యూరియా అందిస్తామని హామీ...**



**నేటి సాక్షి చిలుకూరు:** 07 ఫిబ్రవరి 2026 నాడు చిలుకూరు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి గారు సందర్శించి యూరియా సరఫరాను మరియు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను గురించి రైతులతో మాట్లాడి సమస్యలను గురించి చర్చించారు. యూరియా కొరత అనేది లేదని జిల్లాలో కావలసినంత యూరియా అందుబాటులో ఉందని అవసరాన్ని బట్టి ప్రతి మండలానికి యూరియా పంపించడం జరుగుతుందని తెలియజేశారు. రైతులు ఆందోళన చెందకుండా అవసరమైనప్పుడు మాత్రమే యూరియాని బుక్ చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. రైతులందరూ మండల పరిధిలోని ఎక్కడైనా యూరియాను ఆన్లైన్లో యాప్ ద్వారా బుక్ చేసుకుని 24 గంటల్లో తీసుకోవాల్సిందిగా రైతులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రశాంతి కుమారి, వ్యవసాయ అధికారి దేవ ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారులు చంద్రశేఖర్, శిరీష, రైతులు లక్ష్మీనారాయణ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

**నేటి సాక్షి గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్ ):** గన్నేరువరం మండల కేంద్రంలో టిఆర్ఎస్ కరీంనగర్ మాజీ ఎంపీ గన్నేరువరం మండల కేంద్రాన్ని దత్తత తీసుకొని ఇక్కడి సమస్యలు తెలుసుకుని గన్నేరువరం మండల కేంద్రంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా గన్నేరువరంలో గ్రంథాలయం లేకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామ ప్రజలు మండల వాసులు పేర్కొన్నారు వివిధ కారణాలతో తాసిల్దార్ కార్యాలయానికి వచ్చే పోలీస్ స్టేషన్ వచ్చే ప్రజానీకానికి గ్రామంలో యువత వృద్ధులు కాలక్షేపానికి కోసం గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు పాకాల పరశురాం ప్రభుత్వాన్ని ఒక పత్రిక ప్రకటనలో కోరారు

# అభివృద్ధి, భవిష్యత్తు కోసం 'కారు' గుర్తుకే ఓటేయండి



- బీఆర్ఎస్ గెలుపులో మహిళలే కీలకం
- 13వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి కంజర్ల రేణుక

నేటి సాక్షి, కరీంనగర్ టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపులో మహిళలు కీలక పాత్ర పోషించాలని 13వ డివిజన్ అభ్యర్థి కంజర్ల రేణుక పిలుపునిచ్చారు. శనివారం డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆమె విస్తృత స్థాయిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సమగ్ర అభివృద్ధి బి.ఆర్.ఎస్‌తోనే సాధ్యం: ఈ సందర్భంగా కంజర్ల రేణుక మాట్లాడుతూ.. నగర అభివృద్ధి మరియు ప్రజల భవిష్యత్తు కోసం నిరంతరం ఆలోచించే పార్టీ బి.ఆర్.ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. "గతంలో ఏ పార్టీ కూడా డివిజన్ అభివృద్ధిపై చిత్తశుద్ధితో పని చేయలేదు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గారి సహకారంతో 13వ డివిజన్‌ను ఒక మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. మార్పు కోసం సంకల్పించిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలి" అని ఆమె కోరారు. సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి గడపకూ చేరవేసిన ఘనత బీఆర్ఎస్‌ది అని, అందుకే మహిళలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కారు గుర్తును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మార్పు కోరుకుంటున్న కోరుట్ల ప్రజలు

- బీజేపీ నేతల ఘాటు వ్యాఖ్యలు
- ఇస్తా రెస్టారెంట్‌లో విలేకరుల సమావేశం
- మున్సిపల్ ఎన్నికల్లో కమలం జెండా ఎగరేయాలని పిలుపు



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలోని ఇస్తా రెస్టారెంట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగిత్యాల జిల్లా బీజేపీ ప్రభారీ గడ్డం శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో రాజకీయ వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా పేరు మారినా పాలనలో ఎలాంటి మార్పు లేదని, "బంగారు తెలంగాణ" అని చెప్పి ప్రజలను కాపలా కుక్కలా ఉపయోగించుకున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని ధనిక రాష్ట్రంగా ప్రచారం చేసినా, వాస్తవంగా లబ్ధి ఎవరికీ దక్కలేదని, ముఖ్యంగా పంపకాల విషయంలో తీవ్రమైన తేడాలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీపై కూడా గడ్డం శ్రీనివాస్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అంటే కరప్షన్, కమిషన్, బుజ్జగింపు రాజకీయాలు, లంకె బిందెలు, వీధి రౌడీ భాష, ఢిల్లీకి డబ్బుల పంపకాలు మాత్రమేనని ఆరోపించారు. దీనికి భిన్నంగా బీజేపీ "సబ్ కా సాత్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్" అనే నినాదంతో దేశ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. కోరుట్ల మున్సిపల్ ప్రజలు స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పుకు బీజేపీనే ప్రత్యామ్నాయమని అన్నారు. కోరుట్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 8 న ఆదివారం రోజున నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ కోరుట్లలో రెండు భారీ బహిరంగ సభల్లో పాల్గొననున్నట్లు నేతలు తెలిపారు. జాన్సీ రోడ్ మరియు వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద జరిగే ఈ సభల్లో కోరుట్ల ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి మున్సిపల్‌పై కమలం జెండా ఎగరేయాలని ఆయన విన్నవించనున్నారు. గెలిచిన కౌన్సిలర్ల అభిప్రాయాలను సేకరించి చైర్మన్ అభ్యర్థిని ఎంపీ అర్వింద్ ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకున్న మోదీ ప్రభుత్వం అమృత్ పథకం కింద కోరుట్ల మున్సిపాలిటీకి ఇప్పటికే రూ.18 కోట్ల 60 లక్షలు మంజూరు చేసిందని బీజేపీ నేతలు గుర్తు చేశారు. మున్సిపల్ బీజేపీ పార్టీ కైవసం అయిన తర్వాత కోరుట్ల అభివృద్ధికి మరిన్ని భారీ నిధులు తీసుకురావడంలో ఎంపీ అర్వింద్ కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే భారీ బహిరంగ సభలను విజయవంతం చేయాలని, కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సమావేశంలో కోరుట్ల మున్సిపల్ ప్రభారీ ఆలపాటి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, కోరుట్ల ప్రముఖ వైద్యుడు డా. అనూప్ రావు పాల్గొన్నారు.

# మల్యాల పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



- డా. రవి రాథోడ్
- తల్లీ-శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**నేటి సాక్షి మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవి రాథోడ్ శనివారం మహబూబాబాద్ మండలంలోని మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం బెతోల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలు, అవసరమైన ఔషధాల నిల్వ, వివిధ ప్రజారోగ్య కార్యక్రమాల అమలు స్థితిని ఆయన పరిశీలించారు. ప్రధానంగా తల్లీ-శిశు ఆరోగ్య సేవలు, గర్భిణీలకు అందుతున్న వైద్య సంరక్షణ, టీకాల కార్యక్రమం, మధుమేహం, రక్తపోటు వంటి అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సేవలు గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా అమలవ్వాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. డీఎంహెచ్ఓ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశమై స్థానిక ప్రజల ఆరోగ్య అవసరాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్న విషయాన్ని సమీక్షించారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని తెలిపారు. రికార్డుల నిర్వహణను సక్రమంగా చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి సిజేరియన్ ప్రసవాలను తగ్గించాలని సూచించారు. సిజేరియన్ ఆపరేషన్ల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలను కోరారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రక్తహీనత ఉన్న గర్భిణీలను గుర్తించి ఐరన్ మాత్రల వినియోగం తప్పనిసరిగా చేయించాలని పేర్కొన్నారు. అసంక్రమిత వ్యాధుల నివారణలో భాగంగా 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించి, గుర్తించిన వారికి తగిన చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ అర్జున్, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మా పాఠశాలకు రహదారిని ఏర్పాటు చేయండి

- అడ్డంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ను తొలగించేందుకు డీడీలు చెల్లించాం

**సాక్షి నారాయణపేట, మరికల్ ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలోని నారాయణపేట వెళ్లే రహదారిలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేయడం జరిగింది. కానీ ఈ పాఠశాలకు దారిని మాత్రం చూపించలేకపోయారని ధన్వాడ మండల కేంద్రంలోని పలుప్రజాసంఘాల నాయకులు వాపోతున్నారు. బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణం అనంతరం పాఠశాలకు వెళ్లేందుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో లోపలినుండే బాలికల పాఠశాలకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని పాఠశాలకు వచ్చే విద్యార్థినిలు వాపోతున్నారు. గతంలో ఈ బాలికల ఉన్నత పాఠశాలకు రహదారిని ఏర్పాటు చేసేందుకు పేట వెళ్లే రహదారిలో గల ట్రాన్స్ఫార్మర్ను తొలగించేందుకు బ్యాంకులో డీ డిలు కూడా చెల్లించడం జరిగిందని పాఠశాల ఉపాధ్యాయులు ధన్వాడ మండలం ఎంఈఓ ఎం. గాయత్రి వివరించారు. బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే ధన్వాడ జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల లోపలి నుండి బాలికల ఉన్నత పాఠశాల కు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పాఠశాల విద్యార్థినీలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ధన్వాడ పలు ప్రజా సంఘాల నాయకులు అధికారుల పనితీరుపై విమర్శిస్తున్నారు. ఇకనైనా జడ్.పి.హెచ్.ఎస్ బాలికల ఉన్నత పాఠశాలకు సులువైన పద్ధతిలో వెళ్లేందుకు డీడీలు చెల్లించిన వాటిని రహదారిని పనులను వెంటనే చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ధన్వాడ పలు ప్రజాసంఘాల నాయకులు





నారాయణపేట జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | ఆదివారం 08 ఫిబ్రవరి 2026

# ప్రకృతిని కాపాడుకోవడం మానవుని బాధ్యత

- సామాజిక సమస్యలకు శాస్త్రీయ దృక్పథమే పరిష్కారం: విజ్ఞానదర్శిని రమేష్
- జగిత్యాలకు చేరుకున్న ప్రకృతి వైజ్ఞానిక యాత్ర - విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు




**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** ప్రకృతిని రక్షించడం మానవుని ప్రాథమిక బాధ్యత అని ప్రజాకవి, కాళోజి అవార్డు గ్రహీత జయరాజ్ పేర్కొన్నారు. జీవజాతుల మనుగడకు మూలమైన ప్రకృతిని సంరక్షిస్తేనే భవిష్యత్ తరాలకు సురక్షిత ప్రపంచాన్ని అందించగలమన్నారు. ప్రకృతిని విస్మరిస్తే క్షామం, కష్టాలు తప్పవని హెచ్చరించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51(ఏ-హెచ్)లో శాస్త్రీయ దృక్పథాన్ని చేర్చిన నేపథ్యంలో, ప్రకృతి సంరక్షణ, రాజ్యాంగ అవగాహన, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "ప్రకృతి వైజ్ఞానిక యాత్ర" శనివారం జగిత్యాల జిల్లా కేంద్రానికి చేరుకుంది. నెహ్రూ సెంటర్ ఢిల్లీ ఆధ్వర్యంలో విజ్ఞానదర్శిని సైన్స్ ఆర్గనైజేషన్, అమ్మ నేత్ర-రక్త-శరీర దాన ప్రోత్సాహకుల సంఘం సభ్యులు తెలంగాణలోని 33 జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రకృతి పరిరక్షణ, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథంపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ ప్రకృతితో మమేకమై జీవించడం అవసరమని, స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, సమాన హక్కులపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విజ్ఞానదర్శిని వ్యవస్థాపకుడు టీ. రమేష్ మాట్లాడుతూ, ఏఐ యుగంలో ఉన్నప్పటికీ సమాజంలో మూఢనమ్మకాలు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక సమస్యలకు శాస్త్రీయ దృక్పథమే సరైన పరిష్కారమని పేర్కొన్నారు. మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా నమ్మకం-మూఢనమ్మకాల మధ్య తేడాను విద్యార్థులకు వివరించారు. అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం అధ్యక్షుడు గంజి ఈశ్వరరావు అవయవ దానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధువాణి, మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డా. వరప్రసాద్, ఫ్యాకల్టీ సభ్యులు, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు, విజ్ఞానదర్శిని సభ్యులు, కళాకారుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కనీస అభ్యసన స్థాయిలను విద్యార్థులు తప్పనిసరిగా సాధించాలి



- డీఈఓ కె. రాము
- 3వ తరగతి FLSపై ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ - ఫిబ్రవరి 26న రాష్ట్రస్థాయి పరీక్ష

**నేటి సాక్షి - కోరుట్ల (రాధారపు నర్సయ్య):** ప్రతి విద్యార్థి కనీస అభ్యసన స్థాయిలను సాధించేలా ఉపాధ్యాయులు కట్టుదిట్టంగా కృషి చేయాలని జగిత్యాల జిల్లా విద్యాధికారి కె. రాము సూచించారు. కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించిన 3వ తరగతి FLS (Fundamental Learning Studies) శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేస్తూ, ఖీూ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయాలని, 3వ తరగతి విద్యార్థులందరూ చదవడం, రాయడం, గణిత ప్రాథమిక నైపుణ్యాలను సాధించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 26న రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి సిహెచ్. సత్యనారాయణ, కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. కృష్ణమోహన్ రావు, రిసోర్స్ పర్సన్స్ జి. రణధీర్, అన్నం మహేష్, సిరిపురం రాజేష్, సిఆర్‌పిలు పి. గంగాధర్, సత్యనారాయణ, మాన్విత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారంలో మాత రమాబాయి 128వ జయంతి



**నేటి సాక్షి, ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని గౌతమ బుద్ధ ఫంక్షన్ హాల్‌లో శనివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి 128వ జయంతి వేడుకలను కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ ఉపాధ్యక్షులు బొల్లి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బొల్లి స్వామి మాట్లాడుతూ మాత రమాబాయి 1898 ఫిబ్రవరి 7న మహారాష్ట్రలోని దబోల్ గ్రామంలో జన్మించారని, చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపిందని తెలిపారు. అంబేద్కర్‌తో బాల్యంలోనే వివాహం జరిగి, ఆయన ఉన్నత విద్యాభ్యాసానికి అండగా నిలిచిన మహనీయురాలని కొనియాడారు. సాధారణ జీవితాన్ని గడిపినా, మహనీయుడి ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన మాత రమాబాయి జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు దాగేటి కొమురయ్య, ఏఎంసీ డైరెక్టర్ కంపల్లి రాజేశం, అంబేద్కర్ అవార్డు గ్రహీత దేవి రాజలింగం, నాయకులు బొల్లి నందయ్య, మద్దునాల రాజమల్లు, సుంచు మల్లేశం, జేరిపోతుల నరసయ్య, పాలకుర్తి లక్ష్మణ్ గౌడ్, బత్తిని సాగర్, ఐలవేణి శ్యామ్, మండిగం గోపీచంద్, బోయిన మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం



- కలెక్టర్ కుమార్ దీపక్

**నేటి సాక్షి, మంచిర్యాల జిల్లా:** సంక్షేమ వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శనివారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల సమీకృత బాలికల వసతి గృహంలో అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆయన పరామర్శించారు. అనంతరం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్‌లతో కలిసి వసతి గృహాన్ని సందర్శించి వార్డులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తోందన్నారు. శుక్రవారం రాత్రి భోజనం అనంతరం 16 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించామని తెలిపారు. వైద్యుల సమాచారం ప్రకారం విద్యార్థినులు పూర్తిగా కోలుకున్నారని, శనివారం సాయంత్రం డిశ్చార్జ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై వసతి గృహ సంక్షేమ అధికారి సుజాతకు షోకాజ్ నోటీసు జారీ చేశామని, వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్వాడీల బీసీ సర్టిఫికెట్లు రద్దు

## చేయాలి మాదిగ హక్కుల దండోరా




**నేటి సాక్షి, మంచిర్యాల జిల్లా:** చెన్నూర్ ప్రాంతంలో బీసీ ఉద్యమ నాయకుడు సిద్ధి రమేష్ యాదవ్‌ను బెదిరింపులకు గురి చేస్తున్న వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, రాజస్థాన్-గుజరాత్‌కు చెందిన మార్వాడీలు స్థానికంగా పొందిన బీసీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర నాయకుడు రేగుంట సునీల్ డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పనిచేస్తున్న రమేష్ యాదవ్‌పై చెన్నూర్‌లో స్థిరపడ్డ రాజస్థాని మార్వాడి వర్గానికి చెందిన శ్యామసుందర్ దేవడా బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అక్రమంగా బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందే ప్రయత్నాలను అడ్డుకున్నందుకు రమేష్ యాదవ్‌పై దాడి చేయాలని కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ఆయన ఇంటి చుట్టూ తిరగడం, ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడటం తీవ్రంగా ఖండనీయమని అన్నారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి, ఇప్పటికే ఎవరైనా మార్వాడీలు బీసీ సర్టిఫికెట్లు పొందితే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్ధి రమేష్ యాదవ్‌కు మాదిగ సమాజం సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# అక్రిడిటేషన్ దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా:** అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు అర్హులైన జర్నలిస్టుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో అక్రిడిటేషన్ మాడ్యూల్ వెబ్ సైట్ ప్రారంభించడం జరిగిందని, 2026-28 సంవత్సరానికి గాను అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనుందని, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. మీడియా యాజమాన్యాలు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కొరకు తమ ప్రతినిధుల పేర్లను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పంపించాలని, అట్టి జాబితాలో ఉన్న అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ నుండి httpsiprtelanganagovin వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.


# దారుణం..


## అనుమానంతో భార్యను ముక్కలు ముక్కలుగా నరికిన భర్త.

## భర్త-అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు.



**నేటి సాక్షి, జగిత్యాల ( గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లాలోని లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున దారుణమైన హత్య జరిగింది.భార్య పై అనుమానంతో కట్టుకున్న భర్తే ఆమె పాలిట కాలయముడయ్యాడు. మల్లయ్య కిరాతకుడిగా మారాడు.అత్యంత పాశవికంగా ఆమె గొంతు కోసి, గొడ్డలితో నరికి చంపిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. పోలీసుల స్థానికుల కథనం మేరకు..లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆధార వేణి మల్లయ్య- సత్తవ్వ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు.కొడుకు హైదరాబాద్ లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే ఉన్నాడు.కూతురు ఇంటి వద్దే ఉంటుంది.మరోసారి భార్య భర్తల మధ్య గొడవ జరిగింది.ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అదును చూసి హత్య చేసినట్లు స్థానికులు తెలిపారు. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న భర్త, శనివారం తెల్లవారుజామున ఆమె నిద్రలో ఉండగా ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు.కోపంతో ఊగిపోతూ గొడ్డలితో ఆమెపై పలుమార్లు దాడి చేశాడు. సమాచారం అందుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని.నిందితుడిని లక్ష్మీపూర్ గ్రామ శివారులో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు సిఐ సుధాకర్ వెల్లడించారు.







# మరొక్కసారి.. ఆశీర్వదించండి!



## మీ రుణం తీర్చుకుంట..

### మీలో ఒకడిగా వార్డును అభివృద్ధికి కృషి చేస్తా!





**నా పేరు జిందం లక్ష్మీనారాయణ.**

సామాన్య కార్యకర్తగా మొదలైన నా జీవిత ప్రయాణాన్ని, ఈ రోజు ఒక ప్రజాప్రతినిధిగా నిలబెట్టింది మీరే... **నా 32వ వార్డు ప్రజలే.!**

నిజంగా చెప్పాలంటే, నేను ఎప్పుడూ నాయకుడినని అనుకోలేదు. ప్రజల్లో ఒకడిగా ఉండాలని మాత్రమే కోరుకున్నాను. మీ మధ్యే తిరుగుతూ, మీ బాధలను వింటూ, మీ సమస్యలను నా సమస్యలుగా భావిస్తూ ముందుకు సాగాను. ఆ నమ్మకానికి మీరు ఇచ్చిన బహుమతే.. **కౌన్సిలర్‌గా అవకాశం.**

**నా జీవితానికి బలమిచ్చింది నా తల్లిదండ్రులు..**
**నా తండ్రి జిందం చిన్న భూమయ్య,**
**నా తల్లి కీ.శే. జిందం సరస్వతి.**

వారు నేర్పిన విలువలే నన్ను ఈ రోజు ప్రజాసేవ దారిలో నడిపిస్తున్నాయి. నా కుటుంబ సభ్యుల అండ, ఆశీస్సులు లేకపోతే నేను ఇక్కడ ఉండేవాడిని కాను. వారందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు.! 2000 నుంచి ఉద్యోగ జీవితం ద్వారా క్రమశిక్షణ నేర్చుకున్నాను. 2015లో యువజన సంఘం అధ్యక్షుడిగా సేవా రంగంలో తొలి అడుగు వేశాను. అక్కడే నాకు ఒక విషయం స్పష్టమైంది..

**సేవే నా లక్ష్యం-ప్రేమే నా మార్గం..అని.!**











పద్మశాలి సంఘం, చేయూత స్వచ్ఛంద సంస్థ, ఆనంద వృద్ధాశ్రమం, ముక్తి నిలయం వంటి కార్యక్రమాల ద్వారా పేదలు, వృద్ధులు, గూడు లేనివారి కోసం చేసిన సేవే నాకు అసలైన సంతృప్తిని ఇచ్చింది. రాజకీయాలు పదవి కోసం కాదు.. సేవను విస్తరించడానికి మాత్రమే అని అప్పుడే నిర్ణయించుకున్నాను.

**2019లో రాజకీయ ప్రస్థానంలో అడుగు పెట్టాను.**

**2020 జనవరి 22న.. నా పుట్టినరోజునే మీరు నాపై ఉంచిన నమ్మకంతో భారీ మెజార్టీతో కౌన్సిలర్‌గా గెలిపించారు. ఆ రోజు నేను ఆనందంతో కాదు.. బాధ్యతతో పులకించిపోయాను.!**

"ఈ నమ్మకాన్ని ఎక్కడా దెబ్బతీయకూడదు" అన్న ఒక్క ఆలోచనతోనే ఐదేళ్లు పనిచేశాను. కరోనా లాంటి కష్టకాలంలో, మీ ఇళ్ల ముంగిటికి నిత్యావసరాలు అందించడం నుంచి, సానిటేషన్ లిక్విడ్ తయారీ వరకూ మీతో పాటు నిలబడ్డాను. జిమ్, గ్రౌండ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఆసుపత్రి ముందు దుకాణాలు, దేవాలయాలు-మసీదుల అభివృద్ధి, చెక్కులు, పింఛన్లు, ట్రై సైకిళ్లు, ఇందిరమ్మ ఇళ్లు...ఇవన్నీ నేను ఒక్కడిని చేసి చూపించలేదు.

**మీ ఆశీస్సులే నా శక్తి.**

మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో, అణగారిన వర్గాల గొంతుకగా మరింత బలంగా నిలవాలనే సంకల్పంతో జువ్వాడి నర్సింగరావు ప్రోద్బలంతో 2024 జూలై 19న కాంగ్రెస్ పార్టీలో చేరాను. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, మీకు ఇంకా మెరుగైన సేవ అందించగలననే నమ్మకమే ఆ నిర్ణయానికి కారణం. ఈ రోజు కూడా నేను అదే మనిషిని.

**అందుబాటులో ఉండే వాడిని.**
**మీ ఫోన్ కాల్ తీసుకునే వాడిని.**
**మీ ఇంటి ముంగిట నిలబడి మాట్లాడే వాడిని.**

**నా విజ్ఞప్తి ఒక్కటే..**

- నా 32వ వార్డును వంద శాతం అభివృద్ధి చేయాలి
- ప్రతి నిరుపేదకు సొంత ఇంటి కల నెరవేర్చాలి
- ప్రతి కుటుంబానికి అండగా ఉండాలి
- ఐదేళ్లు నన్ను కడుపులో పెట్టుకుని కాపాడిన మీరు..

**మరోసారి నన్ను ఆశీర్వదిస్తే,**
**మీ సేవలోనే నా జీవితాన్ని అర్పించుకుంటాను.**
**మీ బిడ్డగా... మీ అన్నగా... మీ సేవకుడిగా...**
**మీ జిందం లక్ష్మీనారాయణ**

**- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**







# మనసున్న మారాజు మళ్లీ పుట్టిన ధర్మరాజు



జీవితంలో గమ్యం స్పష్టంగా ఉంటే.. మార్గం ఎంత కఠినమైనా ప్రయాణం ఆగదు.! అదృష్టం ఒక్కసారే తోడైనా, కృషిఉపట్టుదల జీవితాంతం తోడుంటేనే విజయానికి అర్థం ఉంటుందనడానికి 'మైలారపు లింబాద్రి' జీవితమే నిలువెత్తు నిదర్శనం. కష్టాల మధ్యలోనూ కఠోర శ్రమ, అచంచలమైన పట్టుదల, అంకితభావంతో జీవితాన్ని ఎదుర్కొని వ్యాపార రంగంలో శిఖరాలు అందుకున్న మైలారపు లింబాద్రి, ఆర్యవైశ్య సమాజ సేవలో ముందంజలో నిలిచి, రాజకీయంలో ప్రజానేతగా గుర్తింపు పొందారు. ఒక మామూలు కుటుంబంలో జన్మించి, కుటుంబ భారాన్ని భుజాన వేసుకుని రైస్ మిల్లు ఇండస్ట్రీస్ స్థాపించి విజయవంతమైన వ్యాపారవేత్తగా రాణిస్తూ, సమాజ సేవ, ధార్మిక కార్యక్రమాలు, రాజకీయాల్లో అడుగులు వేసి అందరి గౌరవాన్ని సంపాదించుకున్న ఆయన జీవితం యువతకు నిజమైన స్ఫూర్తి.! వ్యాపారవేత్తగా స్థిరపడుతూ, సామాజిక సేవలో తనదైన ముద్ర వేస్తూ, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రజల మధ్య నిలిచిన ఆయన ప్రయాణం అనేక మందికి స్ఫూర్తిదాయక కథగా నిలుస్తోంది..”!!

– నేటి సాక్షి, మెట్ పల్లి (రాధారపు నర్సయ్య)






## మెట్‌పల్లిలో అడుగీడిన మన 'మైలారపు లింబాద్రి'

- శ్రమ, పట్టుదలతో ఎదిగిన వ్యాపార రత్నం
- ఆర్యవైశ్య సంఘం నుంచి రాజకీయ రంగం వరకు..
- రైస్ మిల్లు సామ్రాజ్యం నుంచి మున్సిపల్ వైస్ చైర్మన్ స్థాయి వరకు..
- కుటుంబ బాధ్యతల నుంచి సమాజ సేవ వరకు..
- ప్రజానాయకుడిగా ఎదుగుతున్న మైలారపు లింబాద్రి జీవన ప్రయాణంపై 'నేటి సాక్షి' ప్రత్యేక కథనం



### బాల్యం, కుటుంబ బాధ్యతలు

ఆగస్టు 10, 1959న మెట్ పల్లి కి చెందిన విఠలయ్య-భాగ్యమ్మ దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించిన మైలారపు లింబాద్రికి. నలుగురు సోదరులు (సత్తయ్య, నరేందర్, శేఖర్, రాజేందర్)తో కలిసి “పంచపాండవులు“లా పెరిగారు. అగ్రజుడిగా ధర్మరాజు వ్యక్తిత్వంతో కుటుంబ బరువు భుజాన వేసుకుని, తండ్రికి చేదోడు-వాదోడుగా నిలిచారు. తండ్రి తర్వాత కుటుంబానికి తలమానికంగా నిలిచి, సోదరులకు ప్రేమ, అనురాగాలు అందిస్తూ తల్లిదండ్రుల ప్రశంసలు అందుకున్నారు.

### విద్య ఆగినా.. ఆగని జీవనపాఠాలు

ప్రాథమిక విద్యను కథలాపూర్ మండలం సిరికొండ ప్రభుత్వ పాఠశాలలో, పదవ తరగతిని భూషణరావుపేట ప్రభుత్వ పాఠశాలలో పూర్తిచేశారు. ఉన్నత విద్య చదవాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు అడ్డు రావడంతో చదువుకు విరామం ఇచ్చి జీవన పోరాటంలోకి అడుగుపెట్టారు. 1976లో కమీషన్ ఏజెంట్‌గా జీవితాన్ని ప్రారంభించి, గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని నిలబెట్టారు. చదువు మానాల్సి వచ్చినా, బాధ్యత నుంచి వెనక్కి తగ్గని మనస్తత్వమే భవిష్యత్ విజయాలకు పునాది వేసింది. ఏడుగురు సభ్యుల కుటుంబాన్ని పోషించడానికి విద్యను ఆపి, 1976లో కమిషన్ ఏజెంట్‌గా జీవితాన్ని ప్రారంభించారు. 1981 వరకు గుమస్తాగా పనిచేసి, తర్వాత లారీ పార్టనర్‌షిప్, కిరాణ వ్యాపారం చేశారు.

### కుటుంబమే బలం.. విలువలే సంపద

మే 2, 1979న కరీంనగర్ జిల్లా కల్వకోటకు చెందిన హనుమాండ్లు-హాళ్య దంపతుల కుమార్తె లక్ష్మితో వివాహం జరిగింది. వీరికి భవాని, శ్రీవాణి, రాంబాబు, శ్రావణి అనే ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు జన్మించారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరమైన తనలాగా కాకుండా పిల్లలందరినీ మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దారు. వారి వివాహాలను ఘనంగా జరిపించారు.

### వ్యాపార రంగంలో విజయయాత్ర

కిరాణ వ్యాపారంలో సంతృప్తి లేకపోవడంతో కొబ్బరి, పప్పుల వ్యాపారం, ఐచర్ వాహనాల అద్దె వ్యాపారాలు చేశారు. 1998లో రైస్ మిల్లును లీజుకు తీసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. భగవంతుని ఆశీస్సులతో విజయం సాధించి, 2009లో కమ్మర్‌పల్లిలో వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ స్థాపించారు. 2019లో బండలింగాపూర్లో భవాని ఇండస్ట్రీస్ నెలకొల్పి రైస్ మిల్లు రంగంలో అందె వేశారు.ఆ ప్రస్థానంలో 2020లో జగిత్యాల జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.



### సామాజిక, ధార్మిక సేవలు

2010లో ఆర్యవైశ్య సంఘంలోకి ప్రవేశించి, చైతన్యనగర్ వాడకట్టు సంఘం అధ్యక్షుడిగా విజయం సాధించారు. 2011లో మెట్ పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. మురళీకృష్ణ ఆలయ నిర్మాణం పూర్తి చేసి, వాసవీ గార్డెన్ నిర్మాణం చేపట్టి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. వేములవాడ ఆర్యవైశ్య నిత్యాన్నసత్రం డైరెక్టర్‌గా, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా 2024లో మళ్లీ విజయం సాధించారు. 74 లక్షలతో 27 గుంటల భూమి కొనుగోలు చేసి, స్వయంగా 11,11,111 రూపాయలు విరాళంగా ఇచ్చి కళ్యాణ మండపం, కార్యాలయ నిర్మాణం చేపట్టారు. స్కాలర్‌షిప్‌లు, అన్నదానం, కరోనా కాలంలో అన్నపాకెట్ల పంపిణీ, దేవాలయ అభివృద్ధి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. “రాష్ట్ర ఉత్తమ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు“ అవార్డు అందుకున్నారు.

### ఇక రాజకీయ ప్రస్థానం షురూ

2014లో టీఆర్ఎస్‌లో చేరి, మెట్ పల్లి మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్‌గా 430 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2018లో మెట్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా (జగిత్యాల జిల్లాలో తొలివారు) ఎన్నికయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య, ఎన్టీఆర్, విద్యాసాగర్ల వంటి నాయకులను స్ఫూర్తిగా తీసుకుని,రాజకీయరంగంలోనూ తనదైన ముద్ర వేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

### సేవా వారసత్వం.. తండ్రికి తగ్గ తనయుడు

కుమారుడు రాంబాబు సైతం ఆర్యవైశ్య యువజన నాయకుడిగా ఎదిగి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. తండ్రిఉకొడుకులు ఇద్దరూ ఒకేసారి సంఘాల్లో కీలక బాధ్యతలు నిర్వహించడం మెట్ పల్లి, జగిత్యాల జిల్లాల్లో ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది.'మైలారపు లింబాద్రి' జీవితం కష్టేఫలి సిద్ధాంతానికి నిలువెత్తు నిదర్శనం. ఆయన మాదిరిగా పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఎవరైనా ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని నిరూపిస్తున్నారు.!

## పదవి కోసం కాదు.. పట్టణాభివృద్ధి కోసం పోటీ

– మైలారపు లింబాద్రి

పదవి కోసం కాదు.. మెట్‌పల్లి భవిష్యత్తు కోసం పోటీ చేస్తున్నాను. నేను గెలిస్తే మెట్‌పల్లిని అభివృద్ధి, పారదర్శకత, ప్రజా సేవలకు మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. పట్టణాభివృద్ధేఉనా ప్రథమ ప్రాధాన్యత. మెట్‌పల్లిలో ఇప్పటికీ పూర్తిస్థాయి డ్రైనేజ్, శాశ్వత రోడ్లు, తాగునీటి సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ప్రతి వార్డులో డ్రైనేజ్ వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు చేసి, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా నిరంతరం గా జరిగేలా చర్యలు తీసుకుంటాను. పేదఉమధ్యతరగతి ప్రజలే నా బలం.పేద కుటుంబాలకు మున్సిపాలిటీ ద్వారా అందే పథకాలు అర్హులందరికీ చేరేలా చూస్తాను. రేషన్ కార్డులు, పెన్షన్లు, నివాస సమస్యల పరిష్కారంలో రాజకీయాలు లేకుండా న్యాయం చేస్తాను.స్వచ్ఛ మెట్ పల్లి నా కల.!చెత్త సేకరణ, డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం, దోమల నివారణ, కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాను. పట్టణ ప్రజారోగ్య కేంద్రాలను బలోపేతం చేసి పేదలకు వైద్య సేవలు అందేలా చూస్తాను.

వ్యాపారులకు, కార్మికులకు రక్షణ వ్యాపారవేత్తగా అనుభవం ఉన్నవాడిగా చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, కార్మికులు ఎదుర్కొనే సమస్యలను అర్థం చేసుకుంటాను. అనవసర జరిమానాలు, వేధింపులు లేకుం డా వ్యాపారానికి అనుకూల వాతావరణం సృష్టిస్తాను. మార్కెట్లు, షాపింగ్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తాను. యువత,మహిళల కోసం, యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెడతాను. మహిళల భద్రత, స్ట్రీట్ లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటులో రాజీ లేకుండా అన్ని వర్గాల అభివృద్ధే నా లక్ష్యం. ప్రజల సమస్యలే నా అజెండా.!



